జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




కృష్ణ | శనివారం 27 జూన్ 2026 | సంపుటి : 01 | సంచిక :163 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తా

- ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు రెండేళ్లు పూర్తి
- నీట్ సహా రాజ్యాంగ పరిరక్షణ వంటి కీలక అంశాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ

# డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- యువత భవిష్యత్తు కోసం
- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం
- డ్రగ్స్‌పై పోరాటం యువత భవిష్యత్తు కోసమే అని గుర్తించాలి
- డ్రగ్స్ బాధితులు తిరిగి జీవితాలు నిర్మించుకోవడానికి సహాయం చేస్తామన్న సీఎం చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ కేంద్రమనేది ఇక గత చరిత్ర



**అమరావతి**

డ్రగ్స్‌పై జరుగుతున్న పోరాటం అంతిమంగా మన యువత కోసం, వారి కలలు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసమేనని గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంద్రబాబు పోస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిర్దాక్షిణ్యంగా ఉక్కుపాదం మోపడానికి, ఇందుకు బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వ్యసనంతో పోరాడుతున్న వారికి సాధ్యమైన మద్దతును అందిస్తూ, వారు గౌరవంగా కోలుకుని, జీవితాలను తిరిగి నిర్మించుకోవడానికి సహాయం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ కేంద్రమనేది ఇక గత చరిత్ర అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మాదకద్రవ్యాల అక్రమ రవాణా పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తూ, కోలుకోవాలని ఆశించే వారికి ఒక భరోసాలా నిలుస్తూ ప్రతి కుటుంబానికి - మిగతా3లో



## ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు

- రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్‌పై రిజిజు సెటైర్
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా తీవ్రంగా విమర్శించిన బీజేపీ

## ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి



- 6 కోట్ల ఓట్లు తొలగింపు
- కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు ఏడాది పూర్తి
- ప్రక్షాళనలో భాగంగా దాదాపు 6 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించిన ఈసీ


# నిజమైన రైతులకే సబ్సిడీ ఎరువులు

- పంపిణీలో సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 155251కు ఫిర్యాదు చేయొచ్చు
- ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డీఏపీ పంపిణీ చేపట్టాం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోంది



**అమరావతి**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన ఏపీఏఐఎంఎస్ 2.0 వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవంతంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. - మిగతా3లో



## ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం

- 6.5 తీవ్రతతో ప్రకంపనలు
- దక్షిణ ఫిలిప్పీన్స్‌ను వణికించిన భూకంపం
- మిండనావోలో 6.5 తీవ్రతతో ప్రకంపనలు
- ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీసిన ప్రజలు

# లక్ష్యం.. డ్రగ్స్ రహిత ఏపీ



- రాబోయే తరాల అభివద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయి
- రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

**అమరావతి**

దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపారటట్మంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫెరెంట్లీ ఏబుల్డ్, ట్రానట?స్జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు. నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్ గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, - మిగతా3లో




## యూరప్‌లో భానుడి భగభగలు

- ఆసియా దేశాల ఏసీలకు భలే గిరాకీ!
- పశ్చిమ, దక్షిణ యూరప్‌ను అతలాకుతలం చేస్తున్న తీవ్రమైన వేడిగాలులు
- పలు దేశాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, వందలాది మరణాలు నమోదు
- ఏసీలకు అమాంతం పెరిగిన డిమాండ్.. ఆసియా కంపెనీలకు భారీ లాభాలు

# రెండు రోజులు వర్షాలు

### ఈదురు గాలులు ఎక్కువగా వీచే అవకాశం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత నుండి మధ్య మహారాష్ట్ర వరకు తెలంగాణ దాని పరిసర ప్రాంతాలపైనున్న ఉపరితల ఆవర్తనం మీదుగా ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం ఉత్తరాంధ్ర, - మిగతా3లో

# దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తా



లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా, దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని, వారి గళాన్ని అధికార కేంద్రాలకు వినిపిస్తానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. చీజుజు సహా రాజ్యాంగ పరిరక్షణ వంటి కీలక అంశాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. వీధుల స్థాయి నుంచి పార్లమెంటు వరకు ప్రజల నమ్మకమే తన అతిపెద్ద బలమన్నారు. లోక్?సభ ప్రతిపక్ష నేతగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మేరకు ఎక్స్?లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. "నేను లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ రెండేళ్లలో రోజూ ఒకే ఒక్క లక్ష్యానికి అంకితమయ్యాను. అదే ప్రతి భారతీయుడి గళాన్ని అధికార కేంద్రాలకు చేరవేయడం. నీట్ (చీజుజు) అభ్యర్థుల కోసం పోరాటం కావచ్చు, ఎన్నికల అక్రమాలను బయటపెట్టడం కావచ్చు లేదా రాజ్యాంగాన్ని కాపాడటం కావచ్చు. ప్రతి విషయంలోనూ నేను మీకు అండగా నిలిచాను. ఈ రోజు కూడా మీకు అండగా ఉన్నాను, ఎప్పటికీ ఉంటాను. వీధుల నుంచి పార్లమెంటు వరకు మీ నమ్మకమే నా అతిపెద్ద బలం. ఈ ప్రయాణం సుదీర్ఘమైనది. కానీ నా సంకల్పం మాత్రం మారలేదు. మీ కోసం ప్రతి పోరాటాన్ని కొనసాగిస్తాను. జై హింద్. జై రాజ్యాంగం."

2024 జూన్?లో ప్రతిపక్ష నాయకుడిగా నియమితులైన రాహుల్ గాంధీ భారత పార్లమెంటరీ రాజకీయాల్లో ఒక చారిత్రక మార్పుకు నాంది పలికారు. ఎందుకంటే 16, 17వ లోక్‌సభల కాలంలో ఈ పదవి దశాబ్దం పాటు ఖాళీగా ఉండిపోయింది. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం, ప్రతిపక్ష నాయకుడి (హూశీ) పదవిని దక్కించుకోవాలంటే ఒక పార్టీ సభ మొత్తం బలం (543 స్థానాలకు గాను 55)లో కనీసం పదో వంతు స్థానాలను గెలుచుకోవాలి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 99 స్థానాలను గెలుచుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ అర్హతను సాధించింది.

2004లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రాహుల్? గాంధీ చేపట్టిన మొట్టమొదటి అధికారిక రాజ్యాంగబద్ధమైన పదవి ఇదే. అలాగే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా గాంధీ కుటుంబ సభ్యుడు వ్యవహరించడం ఇది మూడోసారి. అంతకుముందు సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ కూడా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. రాహుల్? గాంధీ ఐదుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఉత్తర్?ప్రదేశ్?లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు.

**ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఫైర్**

ఇదిలా ఉండగా, మరో పోస్ట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పుట్టినరోజున ఆయనను ప్రశంసించడాన్ని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణల తర్వాత తన కేబినెట్ సహచరుడికి శుభాకాంక్షలు తెలిపినా ఆయన, ప్రాణాలు కోల్పోయిన పిల్లల గురించి ఒక్కసారైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. విచ్ఛిన్నమైన వ్యవస్థ, జవాబుదారీతనం వహించడానికి నిరాకరించే ప్రభుత్వం వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు, భవిష్యత్తు నాశనమయ్యాయని అన్నారు. ఈ జాబితాలోని ప్రతి పేరు ఒక కల, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉన్న బిడ్డది. ఇవన్నీ ఒక విచ్ఛిన్నమైన వ్యవస్థ, పాఠాలు నేర్చుకోవడానికి లేదా జవాబుదారీతనం వహించడానికి నిరాకరించే ప్రభుత్వం వల్ల నాశనమయ్యాయి. ప్రతి ఒక్క విద్యార్థిని గుర్తుంచుకోండి. ప్రధాని మోదీ ధర్మేంద్ర ప్రధాన్ పుట్టినరోజున ఆయనను ప్రశంసించినప్పుడు, ఈ పిల్లల గురించి ఒక్కసారైనా ఆలోచించారా?" అంటూ పార్టీ నేత పవన్? ఖేడా పోస్ట్?ను రాహుల్ గాంధీ ట్యాగ్? చేశారు. ఇందులో నీట్? పేపర్? లీక్? ఆరోపణల తర్వాత మరణించిన 14 మంది విద్యార్థుల పేర్లు ఉన్నాయి.

# ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు. ఆయన వ్యాఖ్యలపై చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రతిపక్ష నేత రాహుల్ తరచుగా క్షమాపణలు చెబుతున్నారని విమర్శించారు. "తప్పుడు ఆరోపణలు చేసిన తర్వాత ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు రాహుల్ గాంధీ లేదా అరవింద్ కేజ్రీవాల్" అని రిజిజు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ చౌహాన్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టులో విచారం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. అంతకుముందు కార్తికేయ చౌహాన్‌పై తాను చేసిన పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టు ముందు విచారం వ్యక్తం చేశారు. 2018లో ఝబువాలో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో పనామా పేపర్స్ లీక్ కుంభకోణానికి సంబంధించి తన పేరును ప్రస్తావించి, తన ప్రతిష్టను దెబ్బతీశారని కార్తికేయ చౌహాన్ ఆరోపించారు. ఈ మేరకు భోపాల్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో రాహుల్ గాంధీపై పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు.

**రాహుల్ విదేశీ పర్యటనలపైనా బీజేపీ ఫైర్**

మరోవైపు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా బీజేపీ తీవ్రంగా విమర్శించింది. రాహుల్ గాంధీ ఎప్పుడూ సెలవుల మూడ్‌లోనే ఉంటారని ఎద్దేవా చేసింది. పార్లమెంట్, ఎన్నికలు లేదా తన పార్టీకి




అవసరమైనప్పుడల్లా తరచుగా గైర్హాజరవుతారని బీజేపీ శుక్రవారం ఆరోపించింది. తాజాగా రాహుల్ గాంధీ "మరో విదేశీ పర్యటన"లో ఉన్నారని పేర్కొంది. హూశా అంటే 'లీడర్ ఆఫ్ అపొజిషన్' కాదని, 'లీడర్ ఆఫ్ పర్యటన్, పార్టీంగ్' అంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా వీడియో ప్రకటనలో వ్యాఖ్యానించారు.

"రాహుల్ గాంధీ లీడర్ ఆఫ్ అపొజిషన్ పేరును 'లీడర్ ఆఫ్ పర్యటన్, పార్టీంగ్'గా మార్చుకోవాలి. ఎందుకంటే ఆయన ఎప్పుడూ చేసేది అదే. పార్టీలు, పర్యాటకం, ప్రయాణాలు. ప్రజలు, పార్లమెంట్‌కు లేదా దేశానికి కూడా ప్రాధాన్యం ఇవ్వరు. ఆయన పర్యాటకానికే మొదటి ప్రాధాన్యం ఇస్తారు. పార్టీకి సంస్థాగత మద్దతు అవసరమైన కీలక సమయాల్లో పారిపోతారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో అందుబాటులో ఉండరు. రాహుల్ గాంధీ నిరంతరం సెలవుల మూడ్‌లో ఉంటారు. ఒకవైపు, ప్రధానమంత్రి మోదీ దేశంలో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా, ప్రభుత్వ అధినేతగా 9,000 రోజులకు పైగా ఆయన ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. దీనినే పని విధానం, సేవా విధానం అంటారు. మరోవైపు రాహుల్ గాంధీ కేవలం సెలవులో ఉన్నందున, ఆయన అత్యధిక కాలం పనిచేసిన ప్రతిపక్ష నాయకుడిగా నిలిచే అవకాశం ఉంది." రాహుల్ గాంధీ వందలాది విదేశీ పర్యటనలు, యాత్రలు చేపట్టారని, ఈ పర్యటనలకు నిధుల కేటాయింపును పూనావాలా ప్రశ్నించారు. "సాధారణంగా ప్రజలు రెండు ప్రాజెక్టుల మధ్య సెలవు తీసుకుంటారు. రాహుల్ గాంధీ మాత్రం రెండు సెలవు కాలాల మధ్య కొద్దిపాటి సమయం పని కోసం భారతదేశానికి వస్తారు. ఆయన తన విహారయాత్రల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. కానీ విదేశీ పర్యటనలు, ప్రయాణాల కోసం ఈ డబ్బును ఎలా ఖర్చు చేస్తున్నారో లెక్క చెప్పలేకపోతున్నారు. స్పష్టంగా, కొన్ని అనుమానాస్పద సంస్థలే వీటికి నిధులు సమకూరుస్తున్నాయి. అవే అజెండాను నిర్దేశిస్తాయి. అది సాధారణంగా భారత్‌కు వ్యతిరేకమైనదిగా ఉంటుంది. దీనిపై కూడా కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఎలాంటి వివరణ ఇవ్వడం లేదు. రాహుల్ గాంధీ మరోసారి విదేశాలకు వెళ్లారు. పార్లమెంటుకు, పార్టీకి, ప్రజలకు ఆయన అవసరం ఉన్నప్పుడు ఆయన కనిపించకుండా పోయి, భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్ముతారు." అని పూనావాలా అన్నారు.

# ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు ఏడాది పూర్తయింది. ఈ ప్రక్షాళనలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 6 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం తొలగించింది. ఈ భారీ తొలగింపులపై ప్రతిపక్షాలు, ఎన్నికల సంఘం మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశ ప్రక్షాళన కొనసాగుతోంది. గత ఏడాది జూన్ 24న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. బిహార్‌లో ఈ ప్రక్రియ ద్వారా ఏకంగా 65 లక్షల ఓట్లను తొలగించారు. అయితే, పత్రాలు లేవన్న నెపంతో, అధికార బీజేపీకి మేలు చేసేందుకే ఎన్నికల సంఘం ఈ చర్యలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కానీ, ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవ తీర్పుతో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ రివిజన్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే, ఈ ఓట్ల తొలగింపు ప్రభావం సంక్షేమ పథకాలపై కూడా పడుతోంది. బంగాల్, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్ల డేటాను సామాజిక భద్రతతో అనుసంధానం చేయడంతో, ఓటు హక్కు కోల్పోయిన వారు ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమవుతున్నారు. ఈ భారీ ప్రక్షాళన కార్యక్రమం ప్రాముఖ్యతను గుర్తిస్తూ, దీనిని ఎన్?సీఈఆర్?టీ సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల్లో కూడా చేర్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులను తొలగించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అందులో వివరించారు. ఇక గత ఏడాది అక్టోబరు 27న ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండో దశ ప్రారంభమైంది. దీని ద్వారా ఈ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను



ఏకంగా 10.2 శాతం మేర కుదించారు. ప్రక్షాళనకు ముందు 50.99 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు పడిపోయింది. అంటే 5.18 కోట్లకు పైగా పేర్లను తొలగించారు. ఇందులో మరణించిన 66,88,000 మంది పేర్లను జాబితా నుంచి తీసేశారు. అత్యధికంగా యూపీలో 25.47 లక్షలు, బంగాల్‌లో 24.16 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత మరో 63.16 లక్షల పేర్లను డిలీట్ చేశారు. ప్రస్తుతం (ఎస్ఐఆర్) ప్రక్రియ మూడో దశకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 14న మూడో దశ సవరణ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏకంగా 36.73 కోట్ల మంది ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ మూడో దశ సవరణ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

**యావత్ దేశాన్ని కుదిపేసిన వివాదం**

బంగాల్‌లోని మాల్దాలో ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొన్న ఏడుగురు న్యాయాధికారులను నిర్బంధించిన ఘటన అప్పట్లో యావత్ దేశాన్ని కుదిపేసింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళనకారులు ఈ చర్యకు దిగారు. మొదట న్యాయాధికారులతో సమావేశం కావాలని నిరసనకారులు కోరగా, అందుకు అనుమతి నిరాకరించడంతో అధికారులను నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని జ్యుడీషియల్ అధికారులను నిర్బంధం నుంచి విడిపించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం మండిపడింది. ఇది దురదృష్టకర పరిణామమని ఆవేదన వ్యక్తం చేసింది. దీన్ని ఉద్దేశపూర్వకంగా చేసిన దాడిగా పేర్కొంది. బంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని వ్యాఖ్యానించింది. ముగ్గురు మహిళలు సహా ఏడుగురు న్యాయాధికారులను కొన్ని అసాంఘిక శక్తులు నిర్బంధించాయని, ఆ రోజు అర్ధరాత్రి వరకు తాను స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాల్సి వచ్చిందని స్వయంగా సీజేఐ వెల్లడించారు.

## ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం..

దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని మిండనావో ప్రాంతంలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం, శుక్రవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో ఈ శక్తివంతమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన తీరప్రాంత ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి, ముందుజాగ్రత్త చర్యగా ఎత్తైన ప్రదేశాలకు పరుగులు తీశారు. అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్), జర్మన్ రీసెర్చ్ సెంటర్ (జీఎఫ్‌జెడ్) నివేదికల ప్రకారం, దవావో రీజియన్‌లోని సారంగానికి 34 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో సుమారు 42 నుంచి 52 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం ధాటికి దవావో నగరంలోని భవనాలు కంపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, ఈ భూకంపం వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు ప్రస్తుతానికి ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. ఇదే ప్రాంతంలో జూన్ 8వ తేదీన 7.8 తీవ్రతతో సంభవించిన పెను భూకంపం నుంచి ప్రజలు ఇంకా కోలుకోకముందే తాజాగా మరోసారి ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇటీవలి విపత్తు కారణంగా 81 మంది ప్రాణాలు కోల్పోగా, 1,300 మందికి పైగా గాయపడ్డారు. సుమారు 16 లక్షల మంది ఈ ఘటనతో ప్రభావితులయ్యారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' జోన్‌లో ఉన్న ఫిలిప్పీన్స్‌లో ఇటువంటి భూకంపాలు సంభవించడం సర్వసాధారణం.

## యూరప్‌లో భానుడి భగభగలు...




పశ్చిమ, దక్షిణ యూరప్ దేశాలు ప్రస్తుతం తీవ్రమైన వేడిగాలులతో అట్టుడుకుతున్నాయి. జూన్ నెలలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో, ఎయిర్ కండిషనర్లకు (ఏసీ) అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ఈ పరిణామం ఆసియాకు చెందిన ఏసీ తయారీ కంపెనీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉత్తర ఆఫ్రికా నుంచి వీస్తున్న వేడిగాలుల ప్రభావంతో బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి చేరాయి. స్పెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటడంతో పలు దేశాలు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. ఈ తీవ్ర వడగాల్పుల కారణంగా జూన్ 21 నుంచి ఒక్క స్పెయిన్‌లోనే సుమారు 212 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. ఫ్రాన్స్, ఇటలీలలోనూ మరణాలు నమోదవుతుం డటంతో ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణంగా యూరప్ ఖండంలో ఏసీల వినియోగం చాలా తక్కువ. ఫ్రాన్స్‌లో కేవలం 25 శాతం గృహాల్లోనే ఏసీలు ఉండగా, యూరప్ మొత్తంగా చూస్తే ఈ సంఖ్య 20 శాతం లోపే ఉంటుంది. అక్కడి భవన నిర్మాణాలు ప్రధానంగా శీతల వాతావరణానికి అనుగుణంగా రూపొందించబడటంతో, ప్రస్తుతం సంభవిస్తున్న ఉష్ణోగ్రత మార్పులను తట్టుకోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో, ఏసీల కొనుగోళ్లకు ప్రజలు భారీగా మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా శాంసంగ్, ఎల్‌జీ, మిడియా, మిత్సుబిషి ఎలక్ట్రిక్ వంటి ఆసియా కంపెనీల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో ఏసీల విక్రయాలు ఏకంగా 108 శాతం వృద్ధి చెందగా, జర్మనీలో 37 శాతం మేర పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో భవిష్యత్తులోనూ యూరప్‌లో ఏసీలకు డిమాండ్ ఇలాగే కొనసాగుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## పాస్‌పోర్ట్ కూడా పౌరసత్వాన్ని నిరూపించకపోతే, మరి ఏ పత్రం చేస్తుంది?

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. కేంద్రం చెబుతున్న విధానం చట్టపరంగా ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని, ఆధార్ కూడా పౌరసత్వాన్ని నిర్ధరించదని చెబితే, సాధారణ భారతీయుడు తన పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఆ అంశంపై ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు చట్టాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. ఆ ప్రకటన అనంతరం సామాజిక మాధ్యమాలు, రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. దీనిపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన శశి థరూర్, కేంద్రం వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. "దశాబ్దాలుగా భారతీయులు పాస్‌పోర్ట్‌ను అత్యంత విశ్వసనీయ ప్రభుత్వ గుర్తింపు పత్రంగా భావిస్తున్నారు. పోలీసు ధ్రువీకరణ, పలు పత్రాల పరిశీలన తర్వాతే పాస్‌పోర్ట్ జారీ చేస్తారు. అలాంటి కఠిన ప్రక్రియ తర్వాత ఇచ్చే పత్రం పౌరసత్వాన్ని నిరూపించదని చెప్పడం చట్టపరమైన వైరుధ్యాన్ని సృష్టిస్తోంది. పాస్‌పోర్ట్ కూడా పౌరసత్వాన్ని నిరూపించకపోతే, మరి ఏ పత్రం చేస్తుంది? ప్రపంచస్థాయి బయోమెట్రిక్ వ్యవస్థతో కూడిన ఆధార్ ఉంది. ప్రభుత్వమే జారీ చేసిన పాస్‌పోర్ట్ కూడా ఉంది. కానీ ఆ రెండింటిలో ఏదీ పౌరసత్వానికి తుది ఆధారం కాదని చెప్పడం వల్ల సాధారణ ప్రజలు పరిపాలనా పరమైన అయోమయంలో పడుతున్నారు" ఇదిలా ఉండగా, ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాసానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ఆధారం కాదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం కోట్లాది మంది భారతీయులు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. చట్టాల్లో మార్పులు చేసి, ప్రభుత్వం రద్దు చేయనంత వరకు చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్ లేదా సాధారణ ఆధార్ కార్డును భారత పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే, భారతీయులు, నివాసితులకు ప్రత్యేక రంగు లేదా ప్రత్యేక గుర్తింపుతో ఉండే ఆధార్ కార్డులను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధంగా భారతీయ పౌరులు, పౌరులు కాని వారిని స్పష్టంగా వేరు చేయవచ్చని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఆధార్ కార్డు లేదా చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం గుర్తించవచ్చని చెప్పారు. దీంతో ఎన్నికల జాబితాల సవరణలు వంటి ప్రక్రియల్లో అనవసర వివాదాలు తగ్గుతాయని, పరిపాలనా ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. "ఈ రెండు పత్రాల్లో ఏదో ఒకటి ఉంటే భారత పౌరుడిగా గుర్తించే విధానాన్ని అమలు చేస్తే, పౌరసత్వంపై అనవసర చర్చలకు ముగింపు పడుతుంది. ప్రజలకు కూడా తమ గుర్తింపు విషయంలో పూర్తి చట్టపరమైన స్పష్టత లభిస్తుంది" అని శశి థరూర్ తన పోస్టులో పేర్కొన్నారు.

**'పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే'**

ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం నిర్వహించిన సమావేశంలో భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని వెల్లడించింది. అనంతరం గురువారం కూడా ఆ అంశంపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇటీవల లేదా గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని తెలిపింది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను కేంద్రం ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించింది.

# శత్రువులుగా మిత్రపార్టీలు

**ఏలూరు :** కాపు కులం కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణాలు ఆయన్ని ఇరకాటంలో పడేస్తున్నాయంటున్నారు. ఇటీవల వైసీపీ కాపు నేతలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నాక జరుగుతున్న పరిణామాల మీద, పార్టీ తరపున కౌంటర్స్ వేసేందుకు ముందుండమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేని ఆదేశించిందట జనసేన అధిష్టానం. అందుకు తగ్గట్టే ప్రత్యర్థుల్ని అదీకూడా సొంత సామాజికవర్గానికి చెందిన వాళ్ళని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అలాగే ఆయన ఏం మాట్లాడినా వెంటనే వైసీపీ కాపు నేతల వైపునుంచి రివర్స్ పంచ్‌లు కూడా స్ట్రాంగ్‌గా పడుతున్నాయి. దీంతో బొలిశెట్టి బాగా ఫీలవుతున్నట్టు తెలుస్తోంది.రాష్ట్రంలో చాలామంది జనసేన నాయకులు ఉన్నప్పటికీ? ప్రతిపక్ష నేతల్ని, ప్రత్యేకించి కాపు సామాజిక వర్గ నేతలను ఎదుర్కోవడం ఓ రకంగా ఇబ్బందికరమేనని భావిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యే అయ్యానన్న ఆనందంకంటే ఇదెక్కడి పొలిటికల్ కులగోల అన్న అసహనమే పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు సొంత నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనతో కలిసి పని చేయడానికి ముందుకు రాకపోగా ఇమేజ్‌ని డామేజ్ చేయడానికి చేస్తున్నారట. అందుకే శత్రువులుగా మారిన మిత్ర పార్టీ నేతలతో పోరాడడానికే రెండేళ్లు సరిపోయిందంటూ ఏ వేదికల మీద బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారాయన. కలిసి పని చేయండని రెండు పార్టీల అధిష్టానాలు ఆదేశిస్తున్నా తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు మాత్రం జనసేనతో కలిసి ముందుకెళ్లేందుకు ససేమిరా అంటున్నారన్నది ఎమ్మెల్యే మాట. పైగా ఎమ్మెల్యే ఎంతో మేమూ అంతేనన్నట్టుగా టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జీ వ్యవహరిస్తున్నారన్నది బొలిశెట్టి వర్గం కంప్లయింట్. ఇలాంటి సమయంలో వైసీపీని ఏకిపారేయాల్సి రావడం అదనపు తలనొప్పిగా మారిందన్నది ఆయన సన్నిహితుల మాట. ప్రస్తుత రాజకీయ




పరిస్థితుల్లో మాటల తూటాలు సరిగ్గా టార్గెట్ చేరితే సరే.. ఎక్కడైనా రివర్స్ అయిందంటే అసలుకే ఎసరు వచ్చి సొంత కులం వాళ్ళకే తాను టార్గెట్ అవుతానన్న భయం కూడా బొలిశెట్టిని వెంటాడుతోందట.దాంతో అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూనే.. కాపు కులానికి చెందిన ప్రత్యర్థుల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోందని, ఫైనల్‌గా అందరి టార్గెట్ నేనే అవుతానా అన్న అనుమానం సైతం ఆయన్ని వెంటాడుతోందట. మిత్ర పార్టీ నేతలతో ఇంట గెలిచేందుకు ఇప్పటికే నానా తంటాలు పడుతుంటే.. ఇప్పుడు రచ్చ గెలవాల్సిన అనివార్యత ఎదురవుతోంది. ఇదే విషయాన్ని చెబుతూ?. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తనను బాహుబలి అని ఎందుకు పిలిచారో ఇప్పుడు అర్థమవుతోందని సన్నిహితుల దగ్గర సెటైర్లు సైతం వేస్తున్నారట ఎమ్మెల్యే. రోజు రోజుకి కాక పెంచుతున్న జనసేన వర్సెస్ వైసీపీ రాజకీయం ఒకవైపు, తాడేపల్లిగూడెంలో టిడిపి వర్సెస్ జనసేన ఫైట్‌లో ఎవరు కట్టప్పలవుతారో అర్థం కాని అయోమయం మరోవైపు కలగలిసి తీవ్ర గందరగోళంలో ఉన్నారట శ్రీనివాస్. దీంతో కూటమిలోని ఇబ్బందులేంటో తన దాకా వస్తేగానీ? ఎమ్మెల్యేకి తెలియడం లేదా? ఇప్పటికైనా మా బాధలేంటో అర్థం చేసుకోండని కింది స్థాయి నాయకులు సూటిపోటి మాటలు అంటున్నారట. అలా మొత్తం మీద మా ఎమ్మెల్యే గట్టిగానే ఇరుక్కున్నారన్నది తాడేపల్లిగూడెం టాక్.

# టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్


**నెల్లూరు :** నెల్లూరు జిల్లా ఉదయగిరి టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్ వస్తున్నాయట. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం రీ యూనియన్ అవుతున్నట్టు తెలుస్తోంది. పాత తరం పార్టీ నేతలకు, ఎమ్మెల్యేకి మధ్య బాగా గ్యాప్ పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. వరుస భూ వివాదాలు కాకర్ల మెడకు చుట్టుకుంటున్నాయట. అనుచరులు చేసే తప్పులకు కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడం ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారుతోందంటున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చని పాత తరం టిడిపి నేతలందరూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టచ్‌లోకి వెళ్తున్నట్టు తెలుస్తోంది. మండలాల్లో తమకేం పనులు జరగడంలేదని.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం ఎమ్మెల్యే మనుషులు చెప్పినట్టే పనిచేస్తున్నారంటూ సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. 2024 ఎన్నికలకు ముందు ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. అయితే ఫైనల్‌గా ఆయన్ని కాదని టీడీపీ అధిష్టానం ఎన్నారై కాకర్ల సురేష్‌కు మొదటి లిస్ట్‌లోనే అవకాశం కల్పించింది. అప్పటి వరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన సురేష్.. అన్ని వర్గాలను కలుపుకొని జనంలోకి వెళ్ళి ఫస్ట్ అటెంప్ట్‌లోనే విజయం సాధించారు. కానీ? గెలిచాక వైఖరి మారిందన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. వరుస వివాదాలు చుట్టు ముడుతుండగా? అటు బొల్లినేని వర్గాన్ని సైతం దూరం పెట్టేశారన్నది కేడర్ చెబుతున్న మాట. తన వర్గాన్ని దూరం పెట్టినా? బొల్లినేని రామారావు పెద్దగా రియాక్ట్ అవకుండా, నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. నెలకోసారి తన వాళ్ళని కలుస్తున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ చర్చ ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెళ్ళగా.. అదే పెళ్ళికి ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పాతతరం టీడీపీ నేతలు, పలువురు మండలాధ్యక్షులు హాజరయ్యారు.



వాళ్ళంతా కలిసి అప్పుడు ఎమ్మెల్యే మీదున్న అసంతృప్తిని బొల్లినేని దగ్గర వెళ్ళగక్కినట్టు తెలిసింది. కాకర్ల తమను పట్టించుకోవడంలేదని, ఒక సిఐ తో పాటు పలువురు అధికారులను మార్చాలని కోరినా.. చేద్దాం చూద్దామనే మాటలే తప్ప పని జరగడం లేదని వాపోయారట. పోలీస్ స్టేషన్లతో పాటు మండల కార్యాలయాల్లో కూడా తమకు పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అలాగే?. ప్రజలకు, ఎమ్మెల్యేకి మధ్య గ్యాప్ పెరిగిపోవడం వల్లే.. పార్టీకి మైలేజ్ రావడం లేదని అంతర్గతంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరిలో ఎమ్మెల్యే పేరు చెప్పుకొని గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోందని, పార్టీకీ అది పెద్ద డ్యామేజ్ అంటూ చెప్పుకొచ్చారట. ఓ సీఐ వ్యవహార శైలి కూడా ఎమ్మెల్యే కాకర్లకు చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఉందన్నది సీనియర్స్ వాయిస్. నక్కలగండి రిజర్వాయర్ లో ఉండే మత్స్య సంపదను ప్రైవేట్ వ్యక్తులు కాజేస్తుంటే ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ పోలీస్ అధికారి పర్యవేక్షణలో ఈ చేపల దందా సాగుతోందట. ఈ వ్యవహారం ఎమ్మెల్యే కి తెలుసా లేదా అనే అనుమానాలను స్థానిక టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడసలు నియోజకవర్గంలో ప్రతిపక్షం బలంగా ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న చర్చ కూడా నేతల మధ్య జరిగిందట. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి నియోజకవర్గంలో మళ్లీ యాక్టివ్ అవ్వాలని బొల్లినేని రామారావును పాత తరం టీడీపీ నేతలు కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం పార్టీ సెంట్రల్ ఆఫీసులోని గ్రీవెన్స్ సెల్‌లో జాతీయ ఉపాధ్యక్షుడి హోదాలో పని చేస్తున్నారు బొల్లినేని రామారావు. ఇక నుంచి ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలపై కూడా దృష్టి పెట్టాలని కోరారట స్థానిక నేతలు. మరోవైపు ఎమ్మెల్యే కాకర్ల సురేష్? ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సన్నిహితంగా ఉండే వాళ్ళని కూడా దూరం పెడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ జిల్లా అధ్యక్షులకు చెప్పలేక, దూరం పెడుతున్న ఎమ్మెల్యేకి దగ్గర అవ్వలేక కొందరు టీడీపీ సీనియర్స్ సతమతమవుతున్నారట. గతంలో ఎమ్మెల్యేకి దగ్గరగా ఉన్న ఒకరిద్దరు నేతలు కూడా ఇప్పుడు బొల్లినేనికి టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సీఎం చంద్రబాబు హెచ్చరికల తర్వాత ఎమ్మెల్యేలో మార్పు వస్తుందని అందరూ భావించారని, కానీ ప్రస్తుతం అలాం టిదేమీ కనిపించడం లేదని సొంత నేతలే చెబుతున్నారు. వైసీపీ నుంచి వచ్చిన ఒకరిద్దరు నేతలకి ప్రాధాన్యం ఇస్తున్నా రని.. తమను పట్టించుకోవడంలేదని పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాబోయే రోజుల్లో మెట్ట ప్రాంత నియోజకవర్గ రాజకీయం రసకందాయంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం.

# సింగపూర్‌కు సముద్రమార్గంలో బంగినపల్లి

**విజయవాడ :** దేశీయ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఒక కీలక మైలురాయి నమోదయ్యింది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను వాణిజ్యపరంగా తొలిసారి సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా పంపారు. దీంతో తక్కువ ఖర్చు, పర్యావరణ హితంగా తాజా పండ్లను ప్రపంచ మార్కెట్లకు చేర్చేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి పర్యవేక్షించింది. ఇందులో భాగంగా జూన్ 11న ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను ఎగుమతి చేయగా.. ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ చేరుకుంది. ఈ ఎగుమతి ప్రక్రియ విజయవంతం కావడం వెనుక లక్నోలోని ఐకార్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ కీలక పాత్ర పోషించింది.ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి సేకరించిన మామిడి పండ్లను.. కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి ద్వారా రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. స్థానిక మార్కెట్‌లో మామిడి కిలో రూ. 25- రూ. 26 పలుకుతోంది. కానీ, సింగ్‌పూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా కిలోకు సుమారు రూ. 50 వరకు లభించింది. దీంతో రైతుల



ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది.అలాగే, ఈ మామిడి పండ్లను దిగుమతి చేసుకున్న సింగూర్ సంస్థ ఈసీ-లింక్స్ లిమిటెడ్.. నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తియ్యదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ ప్రమాణాలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకోవడం హర్షణీయం. శాస్త్రీయ విధానాల్లో మామిడి కోత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది.బంగినపల్లి మామిడి పండు తన బంగారు పసుపు వర్ణం, పీచులేని గుజ్జు, చక్కటి సువాసన, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఇక, జలమార్గం ద్వారా ఎగుమతి ఖర్చు వాయు మార్గంతో పోలిస్తే తక్కువకావడమే కాదు, పర్యావరణ హితమైందని, వాణిజ్యపరంగా లాభదాయకమైందని రుజువు చేసింది. అలాగే, శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సౌకర్యాలు, శాస్త్రీయ నిర్వహణ విధానాల సహకారంతో సముద్ర మార్గాల ద్వారా రవాణా భారత ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా తగినంత గుర్తింపు తీసుకురావడం అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను జల మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

## రెండు రోజులు వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

కాకినాడ, కోనసీమ,మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు,శ్రామికులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

## లక్ష్యం.. డ్రగ్స్ రహిత ఏపీ

-మొదటిపేజీ తరువాయి

చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యం అని చెప్పారు. గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్న 'ఈగిల్' టాస్క్ ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత గత ప్రభుత్వ కాలంలో ఏజెన్సీ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని దానిని ధ్వంసం చేశామని, ప్రస్తుతం అక్కడ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి 'జీరో కల్టివేషన్' సాధించామని స్పష్టం చేశారు. లిక్విడ్ గంజాయి (హాష్ ఆయిల్) తయారీ కేంద్రాలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ.. ధూమపానం, మద్యపానం కంటే డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ప్రస్తుతం దక్షిణాదిలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ దుర్వినియోగం పెరగడం ఆందోళనకకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా,ఈగిల్ వింగ్ ఎస్పీ జి. స్వరూపారాణి, రాష్ట్ర స్థాయి దేవి ఇని?స్టట్యూషనల్ సొసైటీస్ చైర్ పర్సన్ దేవి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరంతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## నిజమైన రైతులకే సబ్సిడీ ఎరువులు

-మొదటిపేజీ తరువాయి

దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు. రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు. రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతు--కేంద్రీకత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించబడకూడదు... ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు.

## డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి

సురక్షితమైన భవిష్యత్తును అందిస్తుందని వెల్లడించారు. యువశక్తే దేశానికి పెట్టుబడి, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపార్ట్మెంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫెరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు 3.5 నుంచి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13 నుంచి 18 సంవత్సరాల వయసు వారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోం మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో కష్టాలకోర్చి, తమ స్థాయికి మించి పిల్లలను హాస్టల్స్?లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. పట్టుబడితే ఆరు నెలల పాటు జైలు శిక్ష : గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్న 'ఈగల్' టాస్క్ ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని మంత్రి అనిత కొనియాడారు. గంజాయి లేదా డ్రగ్స్ రవాణా చేసినా, దగ్గర పెట్టుకున్నా, కన్స్యూమ్ చేసినా ఎన్?డీపీఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. పట్టుబడితే కనీసం ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి లేదా డ్రగ్స్ అమ్మకాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1972 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని హోం మంత్రి పిలుపునిచ్చారు.

### సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా

సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రటరీ సూర్యకుమారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా, 20 పాయింట్స్ ప్రోగ్రామ్ చైర్మన్ లంకా దినకర్, ఎస్పీ ఈగిల్ కె. నగేష్ బాబు, జి. స్వరూపారాణి, రాష్ట్ర స్థాయి సమన్వయ సంస్థల చైర్ పర్సన్ ఉమారా ణి, దేవి ఇనిస్టిట్యూషనల్ సొసైటీస్ చైర్ పర్సన్ దేవి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరంతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు

**కాకినాడ :** పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ అంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది. మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరా అని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలో ఉందని అన్నారు.

# దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా కోసం పోరాటం ఆగదు!

**జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ కమిషన్ కు పంపిన కదిరికోట ఆదెన్న రూపొందించిన 120 పేజీల మెమోరాండం పుస్తకం ను విడుదల చేసిన దళిత నేతలు**



**జూన్ 26 ( ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు ప్రతినిధి )** క్రైస్తవ మతం మార్చుకున్న దళితులకు ఎస్సీ హోదా కొనసాగించాలని కోరుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం కొనసాగిస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) కర్నూలు జిల్లా అధ్యక్షులు యస్.దేవ సహాయం,డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగలు పేర్కొన్నారు. శుక్ర వారం ఎమ్మిగనూరు నియోజకవర్గం దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా పోరాట సంఘం (దళిత సంఘాలు జేఏసి) ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డా.బి.ఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న స్వయంగా తన రచనలో రూపొందించిన 120 పేజీల మెమోరాండం పుస్తకం ను యం.బి.యెరూష లేం చర్చి పాస్టర్ రెవ డా" జయరాజు బండెల చేతుల మీదుగా ఆవిష్కరించి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నియమించిన దళిత క్రైస్తవ,ముస్లింలకు ఎస్సీ హోదా పరిశీలన, జాతీయ కమిషన్ చైర్మన్, మాజీ భారత న్యాయమూర్తి, జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సమర్పించిన 120 పేజీల మెమరాండంలో అనేక విషయాలను ప్రస్తావించినట్లు వారు తెలిపారు. దళితులు మతం మారిన కులం పోవడం లేదు,దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లకు ఎందుకు ఇవ్వాలి?,మత స్వేచ్ఛ పై రాజ్యాంగం కల్పించిన హక్కులు, 42వ రాజ్యాంగ సవరణ, ఎస్సీ హోదా సవరణలు, ఎస్సీ హోదా కోసం కేంద్ర ప్రభుత్వంనకు సమర్పించిన వివిధ జాతీయ కమిషన్ సిఫార్సులు, క్రైస్తవ మతంలో అగ్రకులాల ఆధిపత్యం,ఈబీసీ కోటా రిజర్వేషన్లు,ఎస్సీ హోదా పై చట్ట సవరణ చేస్తే తప్పేంటి?, ఎస్సీ హోదా కోసం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 3సార్లు చేసిన తీర్మానాలు వంటి అంశాలను ఊటంకిస్తూ వివరణాత్మకంగా ఆధారాలతో కూడిన పత్రములను జతపరిచి సమర్పించామన్నారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని,దళితుల మత స్వాతంత్ర హక్కును హరించి వేస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని,దళితులకు మతంతో సంబంధం లేకుండా రిజర్వేషన్లు అమలు పరచాలని,రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్స్ 14,15,25 లను పటిష్టంగా అమలు చేయాలని, 1955 జస్టిస్ కాకా కాలెల్కర్ కమిషన్,2007 జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికలను అమలు చేయాలని,చింతాడ ఆనంద్ వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ కేసు పై 2026 మార్చి 24న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని, క్రైస్తవులుగా ఉన్న దళితులను ఎస్సీలుగానే కొనసాగించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, జస్టిస్ కె. జి.బాలకృష్ణన్ కమిషన్ తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ జరిపి దళిత క్రైస్తవులకు సానుకూలంగా సిఫార్సులు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రచయితల సంఘం (ద.ర.సం) వ్యవ స్థాపక అధ్యక్షులు ఆరేకంటి భాస్కర్,ఆంధ్ర ప్రదేశ్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కోరిశెట్టి మాల మధు బాబు,ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్ళి మహాదేవ్ మాదిగ, టిడిపి ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు హాలహర్వి దావీదు, ఎమ్మిగనూరు తాలుకా పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ యోహాను, రిటైర్డ్ యల్.ఐ.సి.ఏ.వో.పరిగెల భాస్కర్, ఏపి ఎన్జీజీవోస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యం. సురేష్ వర ప్రసాద్, ఉపాధ్యాయులు అంపయ్య, మద్రి నాగరాజు,మద్రి జోసెఫ్, సి. బెలగల్ రాజు, కోటేకల్ నరసప్ప,నందవరం నరసన్న, పంచాయతీ సెక్రటరీ గుడికల్ రత్నం,సీనియర్ దళిత నాయకులు గుడికల్ స్వామి దాసు, హాలహర్వి మాజీ సర్పంచ్ దాసు,తిమ్మాపురం ఆనంద్,కెవిపియస్ నాయకులు కలుగొట్ల మాల రాజా రమేష్, సొగనూరు సప్పోగు తిమ్మన్న,రాముడు, సుమాల అంతోని, సుమాల రాజు, గుంటెప్ప,మాల ఆనంద్, మాల రంగన్న, రాము,ఎస్సీ కాలనీ టిడిపి నాయకులు కదిరికోట శాంతిరాజు,టైలర్ శాంతి రాజు, కలుగొట్ల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నాను విజయవంతం చేయండి



**కుక్కునూరు,ప్రజా జ్యోతి,జూన్ 26 :** ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఈ నెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె. లక్ష్మయ్య పిలుపునిచ్చారు.స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సోడే.నాగేష్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ, ఆరుగాలం కష్టించి,శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.రైతుకు సబ్సిడీపై ఎరువులు,విత్తనాలతో పాటు వ్యవసాయ సామాగ్రి,రుణాలను అందించి పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి దళారులు ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే సకాలంలో రైతుల పంటకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు.కాగా కాంటూరుతో సంబంధం లేకుండా పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉన్న కుక్కునూరు మండలాన్ని యూనిట్ గా తీసుకొని పరిహారం చెల్లించాలని ఆయిన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెరిగిన కరెంట్,పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు విముక్తి కల్పించాలని ఆయినన్నారు. మహాధర్నాకు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా. శ్యామల, కురాకుల. బాబురావు,మడిపల్లి.రమణయ్య, వరసా.పాపారావు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు 'వయోశ్రేష్ఠ సమ్మాన్'కు క్రీడాకారుడు డి.వి. శంకరరావు నామినేషన్!

**74 ఏళ్ల వయసులో పవర్ లిఫ్టింగ్‌లో అరుదైన రికార్డులు**

**ఎస్బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ ఘన సత్కారం**




**ఎటపాక, జూన్ 26 (ప్రజాజ్యోతి):**వార్ధక్యాన్ని, అనారోగ్యాన్ని సైతం అధిగమించి జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన ప్రముఖ క్రీడాకారుడు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విశ్రాంత అధికారి దేశరాజు వెంకట శంకరరావు (74)కు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'వయోశ్రేష్ఠ సమ్మాన్' జాతీయ అవార్డుకు నామినేషన్ ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ సర్కిల్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ సర్కిల్ 39వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా పవర్ లిఫ్టింగ్‌లో సాధించిన విశేష విజయాలకు గుర్తింపుగా అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణన్, ప్రధాన కార్యదర్శి కృష్ణ కుమార్ శంకరరావును ఘనంగా సన్మానించారు. సమావేశంలో కృష్ణ కుమార్ మాట్లాడుతూ, గుండెకు బైపాస్ శస్త్రచికిత్స జరిగినప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా కఠిన సాధనతో జాతీయ స్థాయిలో రికార్డులు నెలకొల్పడం శంకరరావు సంకల్పబలానికి నిదర్శనమని ప్రశంసించారు. భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌లో కోచ్ జి.వి. రామిరెడ్డి మార్గదర్శకత్వంలో ఆయన సాధించిన విజయాలు యువతతో పాటు సీనియర్ సిటిజన్లకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శంకరరావు సాధించిన విజయాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత వృద్ధుల పురస్కారం 'వయోశ్రేష్ఠ సమ్మాన్' అవార్డుకు తమ అసోసియేషన్ తరఫున అధికారికంగా నామినేట్ చేసే అంశం పరిశీలనలో ఉందని వెల్లడించారు. అధ్యక్షుడు రాధాకృష్ణన్ మాట్లాడుతూ, వార్ధక్యాన్ని శాపంగా కాకుండా అవకాశంగా మలుచుకుని శారీరక దృఢత్వంతో దేశానికి ఆదర్శంగా నిలిచిన శంకరరావును సత్కరించడం తమ అసోసియేషన్‌కు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన వందలాది మంది ఎస్‌బీఐ విశ్రాంత అధికారులు, ప్రతినిధులు శంకరరావును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసిన మొహరం వేడుకలు.....



**హోళగుంద, జులై 26, ప్రజా జ్యోతి న్యూస్:** మండల కేంద్రము హోళగుంద తోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో మొహరం వేడుకలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. గత వారం రోజులుగా ప్రారంభమైన మొహర్రం వేడుకలు చిన్న సరిగెతు, పెద్ద సరిగత్తు సందర్భంగా పీర్ల చావిడిలను రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలో తీర్చిదిద్ది పీర్లకు ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించి, తమ మొక్కులను తీర్చుకున్నారు.శుక్రవారం సాయంకాలం నిర్వహించిన వేడుకలలో భక్తులు వేలాది మందిగా తరలివచ్చి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా యువకులు వివిధ వేషధారణలతో కేరింతలు,ఈలలతో నృత్యాలు చేస్తూ అలరించారు. అనంతరం స్థానిక పాల బావి వద్ద పీర్లకు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ దిలీప్ కుమార్ గురజాల,తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించి మొహరం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించారు.

## దొడియం గ్రామంలో వైభవంగా మొహర్రం పెద్ద సరిగెత్తు..

**భక్తిశ్రద్ధలతో వేలాది మంది పాల్గొనడం**



**ప్రజా జ్యోతి మైలవరం** మైలవరం మండలంలోని దొడియం గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా గురువారం రాత్రి సంప్రదాయబద్ధంగా పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల అలంకరణలతో తీర్చిదిద్దిన పీర్లను గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ముస్లిం, హిందూ సోదరులు మత సామరస్యానికి ప్రతీకగా ఒకే వేదికపై కలిసి ఉత్సవాల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. పెద్ద సరిగెత్తు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహం గా వీక్షించారు.భక్తులు మొక్కులు చెల్లించుకుంటూ పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించగా, గ్రామ ప్రజలు ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో ముగియాలని ప్రార్థించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మొహర్రం ఉత్సవాలు త్యాగం, ఐక్యత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. మొహరం పండుగ నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు

## ఎటపాక నవోదయలో ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం

**11వ తరగతి దరఖాస్తుల గడువు జూన్ 30 వరకు పొడిగింపు**



**ఎటపాక, జూన్ 26 (ప్రజాజ్యోతి):** ఎటపాకలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నిర్ణీత గడువు ముగిసేలోపు విద్యార్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో నేరుగా పాఠశాలను సందర్శించి తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి సీఐ డి. వెంకటేశ్వరరావు





**బేతంచెర్ల, జూన్,26(ప్రజా జ్యోతి)** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో సుమారు 200 మంది ప్రజలకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం సీఐ డి. వెంకటేశ్వరరావు ఎస్సై రమేష్ బాబులు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో సుమారు 200 మంది ప్రజలు పాల్గొని అవగాహన పొందారు.

## దేవస్థాన ఆవరణ అభివృద్ధి కి10,000రూ/ అమర జై చంద్ర.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం ఆవరణం లో అభివృద్ధి పనులు గురించి పాతపట్నం వాస్తవ్యులు అమర జైచంద్ర రూ10,000 విరాళంగా అందజేశారు వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ నీలమణి దుర్గా అమ్మవారు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మా కమిటీ సభ్యులు అందరం వేడుకుంటున్నాం. అభివృద్ధి పనులను భక్తులు దాతలు గ్రామ ప్రజలు అందరు గమనించి సలహాలు సూచనలు ఇచ్చి మన అమ్మవారు కృపాకటాక్షాలకు పాత్రులవు తారని కోరుకుంటున్నాం. కార్యక్రమంలో సైలాడ సతీష్, శంకర్రావు పాల్గొన్నారు. అక్కంద్ర సన్యాసిరావు చైర్మన్ మరియు కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది శ్రీ నీలమణి దుర్గా అమ్మవారు దేవస్థానం పాతపట్నం.

## బద్వేల్‌లో వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన అడ్వకేట్ త్రివిక్రమ్ సింగ్



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 26 (ప్రజాజ్యోతి)**బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధవటం రోడ్డు, సుమిత్రానగర్‌లో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో జూలై 7 నుండి 12 వరకు స్వామివారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ?ఈ సందర్భంగా శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన సీనియర్ అడ్వకేట్, ఆలయ గౌరవ సలహాదారులు త్రివిక్రమ్ సింగ్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాల వివరాలు: ఆలయ అర్చకులు శ్రీ వీరే–శాచార్యులు, టి.టి.డి. వేద పండితుల ఆచార్యత్వంలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి జూలై 7 (మంగళ)సాయంత్రం 5 గంటలకు అంకురార్పణ, గరుడ పట అధివాసము–జూలై 8 (బుధ)మహా కుంభారాధన, తదితర కార్యక్రమాలు శేష వాహన సేవ జూలై 9 (గురు)లక్ష్మీ నారాయణ హోమంహనుమత్ వాహన సేవ జూలై 10 (శుక్ర)స్వామివారి కళ్యాణోత్సవం, గరుడ వాహన సేవ జూలై 11 (శని)లక్ష్మీ హయగ్రీవ హోమంపల్లకీ సేవ జూలై 12 (ఆది)చక్రస్నానం,పుష్పయాగం, మహా పూర్ణాహుతి కార్యక్రమం కలదు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వెంకటరమణ, త్రివిక్రమ్ సింగ్ మాట్లాడుతూ, భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పుష్పయాగం కోసం భక్తులు తమ శక్తికొద్దీ పుష్పాలను సమర్పించుకోవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొడిసిపాటి అంకయ్య, చీదర్ల రమణయ్య, మాలే పెంచల్ రెడ్డి, తాతనబోయిన వెంకటసుబ్బయ్య, మడపూర్ వెంకట రమణ, వల్లం కొండు అనిత్, బండారు సురేష్ బాబు, పత్తి హరీష్, దాస సతీష్ మరియు ఇతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో ఘనంగా ముగిసిన మొహర్రం వేడుకలు.......




**చాగలమర్రి , జూన్ 26( ప్రజాజ్యోతి న్యూస్ ) ;**మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. చాగలమర్రిలో కొలువుదీరిన ప్రధాన పీరు లాల్‌స్వామీ భారీ జనసందోహం మధ్య ఊరేగించారు. ఆయా ప్రదేశాల్లో కొలువుదీరిన హసన్, హుసేన్, అలీ ఆక్బర్, తదితర పీర్ల వద్దకు లాల్‌స్వామిని తీసుకెళ్లి ఫాతేఃహాలు చేశారు. గంధం చల్లుకుంటూ లాల్ స్వామిని ఊరేగించారు. ఆళ్లగడ్డ డిఎస్‌పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ బీవీ రమణ పర్యవేక్షణలో ఎస్‌ఐలు రాజారెడ్డి,శ్రీకాంత్‌లు ప్రత్యేక పోలీస్ బలగాలు,పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పీర్లను నిమజ్జనం కోసం ఊరేగింపుగా తీసుకెళ్లారు.

## తోవి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా మొహరం వేడుకలు



**కౌతాళం,జూన్ 26,ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని తోవి గ్రామంలో శుక్రవారం రోజున గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మొహరం వేడుకలు కులమతాలకుఅతీతంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా మొహరం నెల ప్రారంభమైన రోజు నుండి కొలువైన పీర్ల దేవుళ్లను గ్రామ ప్రజలు కులమతాలకుఅతీతంగా పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చివరి రోజు మొహరం వేడుకలు పీర్ల దేవుళ్లను భాజభజంత్రీల మధ్య ఊరు బావి దగ్గర పీర్లను నిమజ్జనం చేశారు. అక్కడ ప్రత్యేక ఫాతేహాలు (పూజలు) చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## విద్యుత్ ఘాతంతో నెమలి మృతి



**కంబదూరు జూన్ 26 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రం లోని స్థానిక ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం సమీపంలో విద్యుత్ ఘాతానికి గురై ఓ నెమలి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఆహారం కోసం సంచరిస్తున్న నెమలి విద్యుత్ తీగలను తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. జాతీయ పక్షిగా గుర్తింపు పొందిన నెమలి మృతి చెందడం స్థానికులను కలచివేసింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మృతి చెందిన నెమలిని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం అటవీ శాఖ నిబంధనల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిసింది. విద్యుత్ తీగలు, విద్యుత్ సౌకర్యాల సమీపంలో వన్యప్రాణులు ప్రమాదాలకు గురికాకుండా సంబంధిత శాఖలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మొహరం ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి







**సి ఐ,: వెంకటరామిరెడ్డి**

**ఎస్ ఐ :నాగార్జున**

**ప్యాపిలి ప్రజాజ్యోతి :**ప్యాపిలి మండల వ్యాప్తంగా మొహరం (పీర్ల) పండుగ ఉత్సవాలను శాంతి యుతంగా, సామరస్య వాతావ రణంలో నిర్వహించుకోవాలని సి ఐ వెంకటరామిరెడ్డి శుక్రవారం రోజు కలచట్ల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గతంలో కొన్ని గ్రామాలలో చెదురుమదురు సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఈ సంవత్సరం మొహరం ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని కోరారు. అన్ని గ్రామాల పీర్ల కమిటీలు, నిర్వాహకులు, ప్రజలు పోలీసు శాఖ సూచనలను తప్ప నిసరిగా పాటించాలని తెలిపారు. అలాగే పోలీసు శాఖ అనుమతి లేకుండా ఎటువంటి ఊరేగింపులు నిర్వహించరాదని సూచించారు. మద్యం సేవించి లేదా మత్తుపదార్థాల ప్రభావంలో ఉత్సవాలలో పాల్గొనరాదని హెచ్చరించారు. కత్తులు, కర్రలు లేదా ఇతర ప్రమాదకర ఆయుధాలను వెంట తీసుకురావడం నిషేధమని, మత, చర్యలు కుల, సామాజిక వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా నినాదాలు, పాటలు లేదా వ్యాఖ్యలు చేయరాదని తెలిపారు. టపాకా యలు పేల్చి ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. గ్రామ కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవా లని, ట్రాఫిక్కు అంతరాయం కలిగించే విధంగా రహదారులను 'ఆక్రమించ రాదని పేర్కొన్నారు. బాలబాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోలీసు అధికారుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన తీసుకుని కేసులు నమోదు చేయబడతాయని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై బైండోవర్ మరియు ప్రివెంటివ్ చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణ మూర్తి హెచ్చరించారు. మండల ప్రజలందరూ పరస్పర సహకారంతో, సామరస్య భావనతో మొహరం పండుగను ఘనంగా జరుపుకొని పోలీసు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో ఘనంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

## లబ్ధిదారులకు అండగా నిలిచిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు మరియు జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు వేగంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం గొల్లప్రోలు టౌన్‌లోని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ జనసేన పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలు, అత్యవసర కారణాలతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న నియోజకవర్గ ప్రజలకు పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి. ఈ నిధులను మంజూరు చేయించారు. శుక్రవారం మొత్తం ఆరుగురు లబ్ధిదారులకు కలిపి రూ. 8,80,926 విలువైన చెక్కులను జనసేన పార్టీ ముఖ్య నాయకుల చేతుల మీదుగా అందజేశారు.

**లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తే**

పవన్ కళ్యాణ్ చొరవతో ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు:దాసం ప్రశాంత్ కుమార్: రూ. 7,00,941/–అనిశెట్టి దేవి: రూ. 61,390/–గురుబిల్లి అమ్మాజీ రూ. 40,800/–రామిశెట్టి చంద్ర వరలక్ష్మి రూ. 35,795/ఇంటి రాజా రూ. 30,000/–చెక్కపల్లి విష్ణు మూర్తి రూ. 12,000/–మొత్తం పంపిణీ చేసిన నిధులు: రూ. 8,80,926/– లబ్ధిదారులకు అందజేశారు. అలాగే కష్టాల్లో ఉన్న తమను ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించినందుకు లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పిఠాపురం నియోజకవర్గానికి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహించడం తమ అదృష్టమని, ప్రజల కష్టాలను తీర్చడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటా రని లబ్ధిదారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన ముఖ్య నాయకులు గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు కదారి సత్యనారాయణ బలిరెడ్డి గంగ బాబు బస్వా చిట్టిబాబు దువ్వ కొండ బాబు మరియు మొగిలి వీరబాబు పాల్గొన్నారు. వీరితో పాటు మొగిలి రాజా, వినుకొండ అమ్మాజీ పిడక బాబురావు, నందిపు రామకృష్ణ, అరిపి శీను, ఆకుల లావరాజు, బలిరెడ్డి నాని బాబు, రావూరి వెంకటేష్, నేమాల రమేష్, గుద్దటి బుజ్జి, కొసిరెడ్డి సూరిబాబు, అనిశెట్టి రాజా, మరియు ఎస్. రామకృష్ణ ,వివిధ వార్డుల ఇన్‌ఛార్జ్‌లు, పెద్ద సంఖ్యలో జనసైనికులు మరియు వీర మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గొల్లప్రోలులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి

**ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు వినతి**



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)**కాకినాడ:గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో 8 ఏళ్ల క్రితం రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ 'స్వచ్ఛ గొల్లప్రోలు' ప్రతినిధుల బృందం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం కాకినాడలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి స్థానిక రైల్వే సమస్యలను ప్రతినిధులు వివరించారు.

**ప్లాట్‌ఫామ్ పనులు పూర్తి.. హాల్ట్ పునరుద్ధరించండి**

గతంలో గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో సింహాద్రి, బొకారో, రాయగడ, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఉండేదని ప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అయితే రైలు బోగీల సంఖ్య పెరగడం, అందుకు తగ్గట్టుగా ప్లాట్‌ఫామ్ పొడవు లేకపోవడంతో ఎనిమిదేళ్ల క్రితం ఈ హాల్ట్‌ను అధికారులు రద్దు చేశారని తెలిపారు. ప్రయాణికుల వినతుల మేరకు రైల్వే స్టేషన్ ఆధునీకరణ, ప్లాట్‌ఫామ్ విస్తరణ కోసం రైల్వే శాఖ ?310 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు. ఈ పనులు పూర్తయిన తర్వాత హాల్ట్‌లను యథావిధిగా పునరుద్ధరిస్తామని అప్పటి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్, డీఆర్ఎంలు హామీ ఇచ్చారని, ప్రస్తుతం పనులన్నీ పూర్తయినందున వెంటనే ఆ మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరారు. గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లోని సుమారు 30 గ్రామాలకు ముఖ్య కూడలిగాను, ప్రధాన వాణిజ్య కేంద్రంగాను ఉందని ప్రతినిధులు తెలిపారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేకపోవడం వల్ల స్థానిక వ్యాపారులు, ఉద్యోగులు, ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సానుకూలంగా స్పందించిన ఎంపీ**

ఈ సమస్యపై కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి, గొల్లప్రోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ పునరుద్ధరణకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొసిరెడ్డి రాజా, బి. ప్రత్తిపాడు మాజీ సర్పంచ్ వూటా రామకృష్ణ, 'గొల్లప్రోలు చరితామృతం' పుస్తక రచయిత బొజాజ ప్రసాద్, పడాల బాలరాజు, పడాల శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

# టెట్ పై భయాందోళనలు వీడండి

## యుటిఎఫ్ టెట్ కోచింగ్ ప్రారంభోత్సవంలో డీఈవో షేక్ షంషుద్దీన్



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 26 (ప్రజాజ్యోతి)**ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పై భయాందోళనలు వీడాలని కడప జిల్లా డీఈవో షేక్ శంషుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్సీటిఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2028 ఆగస్టు 31 లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, దీనిపై కొందరు ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉందని ఆయన పేర్కొన్నారు. టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయులకు ఆందోళన అవసరమేలేదని, బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడం పెద్ద సమస్యేమి కాదన్నారు. అయితే విద్యాబోధన ఒకవైపు, కుటుంబ బాధ్యతలు మరొక వైపు చూస్తూ టెట్ పరీక్షకు ప్రిపేర్ కావడం కొంత ఇబ్బందికరమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ ఉపాధ్యాయులకు ఉచిత కోచింగ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన నిరుద్యోగులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ను నిర్వహించి నిరుద్యోగుల మన్ననలను అందుకున్నారన్నారు. యుటిఎఫ్ ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాటాలు చేస్తూనే, మరోవైపు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఉపాధ్యాయ సంఘాల కృషి వల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహకాలు చేస్తున్నదని తెలిపారు . యుటిఎఫ్ నిర్వహించే కోచింగ్ ఉపాధ్యాయులు సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణతను తప్పనిసరి చేయడం సహేతుకం కాదన్నారు. బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులలో నెలకొని ఉన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23 (1) కి సవరణ చేపట్టి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆలోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష పై దృష్టి కేంద్రీకరించి, సన్నద్ధతకు సమయం వెచ్చిస్తే పాఠశాలల్లో విద్య బోధన కుంటుపడుతుందని వారు పేర్కొన్నారు. యుటిఎఫ్ ఒకవైపు టెట్ పరీక్ష రద్దుకు పోరాటాలు చేస్తూనే మరోవైపు, ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత పొందేందుకు కృషి చేస్తుందని వారు తెలిపారు. టెట్ ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులెవరూ ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని, ఉపాధ్యాయులు టెట్ పాస్ అయ్యేందుకు అవసరమైన కృషిని యుటిఎఫ్ చేస్తుందని వారు పేర్కొన్నారు. టెట్ పరీక్ష సులభంగా పాస్ అయ్యేందుకు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నామ మాత్రపు ఖరీదుతో పుస్తకాలు రూపొందించి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. రాష్ట్రంలో పేరెన్నికగన్న నిపుణులైన ఫ్యాకల్టీతో కోచింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగపరుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెట్ బోధకులు కోవెల ప్రసాద్ రెడ్డి, బి.మస్తాన్ వలి యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.డి.దేవదత్తం, ఎన్.కంబగిరి, సి.సుదర్శన్, జె.వి.సుబ్బారెడ్డి, ఎ.వీరనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, చెరుకూరి శ్రీనివాసులు, బి.ప్రసన్నలక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌతాళం మండలానికి 100 పడకల హాస్పటల్ శాంక్షన్ చెయ్యాలని కోరుతూ

:-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన

:-బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ,

బిజెపి రాష్ట్ర నాయకులు పురుషోత్తం రెడ్డి



**కౌతాళం, జూన్ 26 ప్రజా జ్యోతి** గురువారం రోజున బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ మరియు బిజెపి రాష్ట్ర నాయకులు పురుషోత్తం రెడ్డి మంత్రాలయం నియోజకవర్గం మాధవరం గ్రామానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసి కౌతాళం మండలానికి వంద పడకల హాస్పిటల్ ను శాంక్షన్ చేయాలని కోరుతూ మెమొరండం ఇవ్వడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా కౌతాళం కి వచ్చినప్పుడు కౌతాళం మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల గురించి ఆయనకు తెలుపడం జరిగింది. అందువలన ఇప్పుడు మన కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున కౌతాళంకి వంద పడకల హాస్పిటల్ ను శాంక్షన్ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరడం జరిగింది. ఆయన కూడా సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే 100 పడకల హాస్పిటల్ ను శాంక్షన్ చేస్తానని తెలపడం జరిగింది.

## చెత్తను తరలించే స్వచ్ఛ సంకల్ప వాహనంలో సిమెంట్ బస్తాల తరలింపు.



**అనంతగిరి మండలం. జూన్ 26. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామ రాజు జిల్లా. అనంతగిరి మండలం. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సంకల్పం చెత్త సేకరణవాహనాలు కొందరు ప్రైవేట్ వ్యక్తుల సొంత పనులకు వాడేసుకుంటున్నారు. కొండిబ పంచాయతీ.దముకు గ్రామంలో చోటుచేసుకున్నఉదంతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది..గ్రామ వీధుల్లోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సిన స్వచ్ఛ సంకల్ప వాహనాన్నికొందరు బినామీ ఇల్లు నిర్మాణదారులు తమ సొంత నిర్మాణ పనుల కోసం యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగాప్రభుత్వ వాహనంలో సిమెంటు బస్తాలను లోడ్ చేసి, నిర్మాణ ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఒకవైపు గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణిస్తుంటే, మరోవైపు ప్రభుత్వ ఆస్తులను ఇలా ప్రైవేట్ అవసరాలకు దుర్వినియోగం చేయడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిఘా కరవు.**

**చర్యలకు డిమాండ్.**

స్థానిక పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి, మరియు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ప్రభుత్వ వాహనాలు ఇలా పక్కదారి పడుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు, స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్న బినామీలపై వారికి సహకరిస్తున్న సిబ్బందిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, వాహనాన్ని తిరిగి పారిశుద్ధ్య పనులకే పరిమితం చేయాలని దముకు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణ పై అవగాహన ర్యాలీ

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి
- ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై రాజు



**పొందూరు ప్రజా జ్యోతి న్యూస్ :** మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పొందూరు జి సిగడాం మండలాల ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై రాజు అన్నారు. అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీకాకుళం వారి ఆదేశాల మేర కు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై రాజు తన సిబ్బందితో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలలో ,కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పొందూరు , జి సిగడాం మండలాలలో జూన్ 19 నుండి 25 వరకు పొందూరు ,కొత్తవలస జెడ్పీ హై స్కూల్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్ష్మీపేట గ్రామంలో సిస్టమ్ డిగ్రీ కళాశాలలో వివిధ విద్యాసంస్థలు గ్రామాల్లో మాదక ద్రవ్యాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు నిర్వహించిన తనిఖీల్లో అనుమానస్పద ప్రాంతాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం వల్ల అనేకమైన అనర్థాలు కలుగుతాయని , శారీరక ,మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. యువత మత్తుకు బానిసై అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ.భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

## దువ్వూరు లో...ఘనంగా మొహర్రం వేడుకలు



**దువ్వూరు,జూన్ 26 (ప్రజా జ్యోతి)** దువ్వూరు మండల కేంద్రంలో మొహర్రం నెల సందర్భంగా గత 9 రోజులు నుంచి ఇమాం ఖాసీం, బాదుల్ల పీరు, హైదర్ గార్ల పీర్లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం శుక్రవారం రోజు ఘనంగా మొహర్రం వేడుకలు చేశారు.ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పీర్ల పండగ ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. ఈ సందర్భంగా మండల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీర్ల స్వాములకు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పులు, సన్నాయి వాయిద్యాల మధ్య పీర్ల స్వాములను గ్రామపుర వీధుల గుండా ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ వేడుకను తిలకించేందుకు మహిళలు, యువకులు, వృద్ధులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు నిలుస్తున్నాయని తెలిపారు. అనంతరం జలది కార్యక్రమం దువ్వూరు బంగ్లా ఆవరణంలో చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మాజీ మంత్రి ముద్రగడను వైసిపి ముఖ్య నేతల పరామర్శ



**ప్రత్తిపాడు (శంఖవరం) జూన్ 26 (ప్రజాజ్యోతి న్యూస్)** వైసిపి పార్టీ పిఏసి కమిటి సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇటీవల అస్వస్తతకు గురి కావడంతో హైద్రాబాద్ లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నారు. చికిత్స పొందుతున్న పద్మనాభంను వైసిపికి చెందిన మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ముఖ్య నేతలు జక్కంపూడి రాజా, దవులూరి దొరబాబు, జక్కంపూడి గణేష్, టిడిపి నేత తోట నవీన్, పలువురు నేతలు, ముఖ్యులు పరామర్శించారు. పద్మనాభం తనయుడు ముద్రగడ గిరిబాబుకు ధైర్యం చెప్పి ముద్రగడ త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ప్రజా సేవలోకి అడుగు పెడతారని ఆకాంక్షించారు. ఈ సంధర్భంగా గిరిబాబు మాట్లాడుతూ తన తండ్రి పద్మనాభంకు అందుతున్న చికిత్సపై వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు తమను, వైద్యులను వివరాలు అడుగుతూ వైద్యులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. తన తండ్రి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న వైసిపి అధినేత జగన్ కు గిరిబాబు ధన్యవాధాలు తెలిపారు.

# కర్నూలులో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఏర్పాటుపై హర్షం

## దివ్యాంగుల స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు పీట్ల మదిలేటి



**బేతంచెర్ల జూన్ 26 (ప్రజా జ్యోతి)**దివ్యంగుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి రాష్ట్రంలోని దివ్యంగుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బేతంచెర్ల స్ఫూర్తి దివ్యంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి, కార్యదర్శి రాముడు తెలిపారు.శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం దివ్యంగుల సమస్యలను తన బాధ్యతగా భావించి కర్నూలులో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. ఈ కేంద్రం ద్వారా దివ్యంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు అందుబాటులోకి వస్తాయని, దీనివల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది దివ్యంగులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కృత్రిమ అవయవాల సహాయంతో దివ్యంగులు ఉపాధి పొందడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి, ఉద్యోగాలు చేయడానికి, స్వతంత్రంగా నడవడానికి వీలు కలుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు.మేము కూడా సకలాంగులతో సమానంగా జీవించగలం, అనే ఆత్మవిశ్వాసం ఈ కేంద్రం ద్వారా దివ్యంగులకు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ గొప్ప కార్యానికి కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి స్ఫూర్తి సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శకుంతల, సురేష్, శ్రీను, మ్యారెప్ప, రామాంజనేయులు, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల నడుమ పీర్ల ఎత్తివేత

## ముగిసిన మొహర్రం మహోత్సవాలు



**ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మొహర్రం పండుగ సందర్భంగా గత పది రోజులుగా అత్యంత వైభవంగా కొనసాగిన పీర్ల ఉత్సవాలు శుక్రవారం పీర్ల ఎత్తివేత కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. మైలవరం మండలంలోని గ్రామంలో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముందుగా గ్రామ వీధుల గుండా పీర్లను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా పీర్ల ఎత్తివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సంప్రదాయం ప్రకారం గుంతను పూడ్చి, పీర్లను ఎత్తి తీసుకెళ్లడంతో ఈ ఏడాది మొహర్రం ఉత్సవాలకు ముగింపు పలికారు. రాయలసీమ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో ఈ విధమైన పీర్ల పండుగ ఆచారాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ భక్తులు భక్తి పారవశ్యంలో పాల్గొనగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు.ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, యువకులు, పోలీసుల సహకారంతో కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. పీర్ల ఎత్తివేతతో ఈ ఏడాది మొహర్రం మహోత్సవాలు విజయవంతంగా ముగియడంతో గ్రామస్తులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## శుక్రవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి విశేష పూజలు.......



**చాగలమర్రి , జూన్ 26( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రిలో శుక్రవారం సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి రాధాకృష్ణ విశేష పూజలు జరిపించారు.ఉభయదారులుగా మాలే ప్రకాష్ ధర్మపత్ని అన్నపూర్ణ కుమారుడు రాజు కుమార్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు ప్రధాన కార్యదర్శి కూరపాటి రామకృష్ణ వరప్రసాద్ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పొందూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ గా చిగిలపల్లి పద్మావతి నియామకం

- చిగిలపల్లి రామ్మోహన్ కు కూటమి నాయకుల అభినందనలు
- దుశ్శాలువాతో ఘన సత్కారం



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**పొందూరు మండల.పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ సతీమణి చిగిలపల్లి పద్మావతి ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన మార్కెట్ కమిటీ జాబితాలో మండల మార్కెట్ కమిటీ చైర్మెన్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కృష్ణాపురం గ్రామ సర్పంచ్ అమ్ముల్ల శ్రీనివాస రావు , జనసేన పార్టీ జిల్లా కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు గార బాబూరావు , కెల్ల నరసింహ మూర్తి , గార గురునాథం పలువురు కూటమి నాయకులు రామ్మోహన్ ను ఆయన స్వగృహమైన ఎరుకలపేట లో శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ గా రైతుల సంక్షేమం , వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం



**చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి జూన్ 26** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మహిళల భద్రతపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జె.కొత్తపల్లి గ్రామంలో సి.కె. దిన్నె సర్కిల్ ఇన్స్పెక్టర్ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సి.ఐ బాల మద్దిలేటి మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు మరియు బాలికలకు రక్షణ కల్పించేందుకు 'శక్తి' యాప్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రమాదంలో ఉన్నప్పుడు యాప్‌లోని ఎస్ఓఎస్ (ఎస్ ఓ ఎస్ ) బటన్‌ను ఉపయోగించడం లేదా డయల్ 112కు కాల్ చేయడం ద్వారా పోలీసులు వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపడతారని వివరించారు.అలాగే మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తు చేశారు. డయల్ 100/112 -- అత్యవసర పోలీసు సహాయం 1098 -- చైల్డ్‌లైన్ 181 -- గృహ హింస సహాయం 1091 -- మహిళల సహాయ హెల్ప్‌లైన్ 1930 -- సైబర్ నేరాల హెల్ప్‌లైన్ ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలు, భద్రతా సేవలపై అవగాహన కలిగి ఉండాలని సి.ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ శ్రీనివాసుల రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గాదిల్లోవ గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలి.

**చేతులు జోడించి జిల్లా కలెక్టర్‌ను వేడుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు.**



**అనంతగిరి మండలం.జూన్ 26. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.**అల్లూరి సీతారామ రాజు జిల్లా.అనంతగిరి మండలం.రొంపల్లి పంచాయతీపరిధిలోని గాదిల్లోవ గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించి ఏర్పాటు చేయాలని విద్యార్థులు,తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌ను చేతులు జోడించి వేడుకుంటున్నారు.గతంలో గాదిల్లోవ గ్రామంలోనే చెట్టు కింద పాఠశాల నిర్వహణ జరిగేది.ప్రస్తుతం పాఠశాలను చిన్నరాబా.గాదిల్లోవ సరిహద్దు ప్రాంతానికి తరలించి నిర్వహిస్తున్నారు. గాదిల్లోవ గ్రామానికి చెందిన 24.మంది విద్యార్థులు, అలాగే మూర్లోవ, పెద్దగుడ్ల గ్రామాలకు చెందిన మరో 20 మంది విద్యార్థులుపాఠశాలలో చదువుతున్నారు.అయితే మూర్లోవ, పెద్దగుడ్ల గ్రామాల నుంచి చిన్నరాబా వద్ద ఉన్న పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు రోజూ సుమారు 3. కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండే ఎండలో చిన్నారులు నడుచుకుంటూ వెళ్లడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సమస్యపై గతంలో ఎం.ఈ.ఓకు ఫిర్యాదు చేయగా, స్థానిక జడ్పీటీసీ డి. గంగరాజుతో కలిసి గ్రామాన్ని సందర్శించిగ్రామంలో షెడ్ నిర్మించుకుంటే పాఠశాల నిర్వహించేలా చూస్తాం" అని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్థులంతా కలిసి తాత్కాలిక షెడ్ నిర్మించగా, కొందరు గుర్తుతెలియని దుండగులు తగలబెట్టారని ఆరోపించారు. అప్పటి నుంచి పిల్లలు పాఠశాలకు వెళ్లడం లేదని పేర్కొన్నారు.ఇప్పటికైనా గాదిల్లోవ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని, లేదా పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. స్థలం చూపిస్తే తమ సొంత ఖర్చుతో షెడ్ నిర్మించుకుని పిల్లల చదువును కొనసాగిస్తామని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు ఎం. ఆర్. ఓ కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెంపి గంగులు, చంపి సన్యాసి, చంపి బాలయ్య, కోటపర్తి గంగమ్మ, కోటపర్తి సన్యాసి, కంసూరి గంగులు తదితర గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం వెంటనే స్పందించి గాదిల్లోవ గ్రామంలోనే పాఠశాలను ఏర్పాటు చేసి చిన్నారుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు.

# జూన్ 30న "చలో విజయవాడ"ను విజయవంతం చేద్దాం

### రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదాం

### ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్దన్



**పీలేరు జూన్ 26 ప్రజా జ్యోతి** రాష్ట్రంలోని రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. సాగు ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నా, పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాలు, అప్పుల భారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోసం జూన్ 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు వేలాది గా పాల్గొని విజయవంతం చేద్దామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.జనార్దన్ కోరారు.శుక్రవారం చలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలు పీలేరు సీపీఐ కార్యాలయంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాక రైతాంగం తీవ్ర నిరాశకు గురైంది.ఈ పరిస్థితుల్లో రైతులు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 30న ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్ లో నిర్వహించే "చలో విజయవాడ" మహాధర్నాను జిల్లాలో రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ప్రభుత్వం వెంటనే రైతాంగ సమస్యలపై స్పందించి, రైతులకు క్వింటాల్‌కు ?2 లక్షల వరకు రుణమాఫీ చేయాలి. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర హామీ ఇవ్వాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2౦50 శాతం ధర అమలు చేయాలి. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు తక్షణమే పూర్తి పరిహారం చెల్లించాలి.అలాగే రైతు భరోసా నిధులను పెంచాలి, పంట బీమా సక్రమంగా అమలు చేయాలి, ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలి. వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి. రైతు వ్యతిరేక విధానాలను విరమించి వ్యవసాయ రంగాన్ని ఆదుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జూన్ 30 "చలో విజయవాడ" కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు కవిత, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కంబదూరులో ఘనంగా మొహరం వేడుకలు

**కంబదూరు జూన్ 26: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రం నందు ఘనంగా మొహరం వేడుకలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆనవాయితీగా పీర్ల పండగ ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. ఈ సందర్భంగా మండల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీర్ల స్వాములకు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పులు, సన్నాయి వాయిద్యాల మధ్య పీర్ల స్వాములను గ్రామపుర వీధుల గుండా ఊరేగింపు ఘనంగా సాగింది. ముఖ్యంగా పురుషులు ప్రత్యేక వేషధారణలతో డప్పుల, వాయిద్యాలనడుమ చిందులేస్తూ స్వామి వారి ఊరేగింపులో ముందుకు సాగారు. ఈ వేడుకను తిలకించేందుకు మహిళలు, యువకులు, వృద్ధులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, మత సామరస్యానికి ప్రతీకగా మొహరం వేడుకలు నిలుస్తున్నాయని తెలిపారు. గ్రామస్తుల ఐక్యత, సాంప్రదాయాల పరిరక్షణకు ఈ ఉత్సవాలు నిదర్శనమని



పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన జలది కార్యక్రమంతో ఈ ఏడాది మొహరం వేడుకలు కంబదూరు మండల కేంద్రంలో ముగిసాయని, నిర్వాహకులు వెల్లడించారు. ఈ



సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ లోకేష్ కుమార్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తోట రామకృష్ణ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించినకూటమి నాయకులు


**కాపులపై కపట ప్రేమ చూపిస్తున్న తోట**



**తాళ్లపూడి, జూన్ 26,ప్రజాజ్యోతి న్యూస్** కాపులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని వైసీపీ పార్టీ నాయకులు తోట రామకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కూటమి నాయకులు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తాళ్లపూడి మండలం అధ్యక్షుడు సిద్దా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో టిడిపి అప్పటి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాపులను బీసీలో చేర్చేలా 5% రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు జీవోను జారీ చేయడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం జాప్యంతో పరిగణలోకి తీసుకోలేదని కాపుల కోసం టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన విదేశీ విద్యను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిగా తుంగలోకి తొక్కారని ఇదే కాపు కులానికి చెందిన పవన్ కళ్యాణ్ ను కాపు కులానికి చెందిన పేర్ని నాని అంబటి రాంబాబుతో జగన్ తిట్టించినప్పుడు గుర్తులేని కులం ఇప్పుడు కులంపై కపట ప్రేమ కనపరుస్తున్నారని కులాన్ని అడ్డుపెట్టుకుని కొందరు రాజకీయ నిరుద్యోగులు కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. చాగల్లు జనసేన మండల అధ్యక్షుడు ఉప్పులూరు చిరంజీవి మాట్లాడుతూ వైసీపీలో ఉన్న కాపులే కాపులు కాదని మిగిలిన పార్టీలో కూడా కాపులు ఉన్నారని కూటమికి సంబంధించిన నాయకుడు గంగుమల్ల స్వామిని కూటమి నాయకులు కొట్టారని తోట విమర్శించడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు.చిన్న విభేదాలు వల్ల వచ్చిన గొడవను అందరం కూర్చుని మాట్లాడుకుని సరిదిద్దుకున్నామని కానీ ఇదే తోట రామకృష్ణను నియోజకవర్గ స్థాయి మీటింగ్ లోనే సొంత వైసిపి పార్టీ నాయకులే చొక్కా చించి పరిగెత్తించికొట్టారని గుర్తు చేశారు. కాపవరం సొసైటీ అధ్యక్షుడు సుంకర సత్తిబాబు మాట్లాడుతూ కాపు కులానికి చెందిన పవన్ కళ్యాణ్ మరియు ఆయన భార్య పై వైసిపి పార్టీకి చెందిన నాయకులు విమర్శిస్తే అప్పుడు మీరంతా ఏమైపోయారని దుయ్యబట్టారు. కాపు కులానికి చెందిన రామానాయుడు, దుర్గేష్ లకు కూటమి ప్రభుత్వం సుముచిత స్థానం కల్పిస్తూ ఉన్నత శాఖలను కేటాయించిందన్నారు .మద్దూరు మాజీ సర్పంచ్ మాట్లాడుతూ మాట్లాడితే తోట రామకృష్ణ కాపు జేఏసీ అని చెప్పుకుంటున్నాడని కాపు జేఏసీ బదులుగా వైసీపీ కాపు జేఏసీ అని పెట్టుకుంటే బాగుంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు తావు లేదని కూటమిలో ఉన్న కాపులందరూ ఐక్యతతో కలిసిమెలిసి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మళ్ళీ వచ్చిన పులి భయందోళలలో ఏజెన్సీ వాసులు

**-రెండు ఆవులపై దాడి చేసి చంపిన పులి-**



**బుట్టాయగూడెం జూన్26 (ప్రజాజ్యోతి):-** ఈ సంవత్సరం జనవరి నెలలో బుట్టాయగూడెం పరిసర ప్రాంతాలలో హల్ చల్ చేసిన పెద్దపులి బుట్టాయిగూడెం మండలం నుండి కొయ్యలగూడెం, పోలవరం మండలాల గుండా తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించి రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో తిరిగిన పులిని అక్కడ అటవీ శాఖ అధికారులు బంధించి విశాఖ పట్నం జూలాజికల్ పార్క్ కి తరలించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి దానికి జిపిఎస్ చిఫ్ అమర్చి అభయారణ్యంలో వదిలి పెట్టిన విషయం పాఠకులకు విధితమే! అయితే ఈ పులి మళ్ళీ తూర్పుగోదావరి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాన్ని భయపెట్టి అక్కడ నుండి పోలవరం మండలం గుండా బుట్టాయిగూడెం మండలంలోకి చొరబడింది. మంగళవారం మండలంలోని నిమ్మల గూడెం సమీపంలో పాలకుంట గ్రామానికి చెందిన గిరిజన రైతులైన కూరం వెంకటేష్ ,సోయం వెంకటేష్ ల రెండు ఆవులపై దాడిచేసి చంపింది.బుధవారం రాత్రి పాలకుంట జీడిమామిడి తోట సమీపంలో తామా వెంకటేష్ కు చెందిన ఆవు దూడను హతమార్చింది. గురువారం రాత్రి మండలంలోని మారుమూల అటవీ ప్రాంత గ్రామమైన రేపల్లెలోని కరకాల నడిపి రాజుకు చెందిన రెండు ఆవులపై దాడి చేసి హతమార్చింది.ఈ సమాచారం తెలిసిన అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని జిపిఎస్ ట్రాకర్ ద్వారా పులి కదలికలను కనిపెట్టడానికి ప్రయత్నాలు చేశారు.అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగవద్దని,పశువులను ఇంటి వద్దే కట్టేసుకోవాలని,లైట్లు వేసుకుని ఉండాలని పలు సూచనలు చేశారు.దీనితో ఏజెన్సీ ప్రాంతం మళ్ళీ ఒక్కసారిగా భయాందోళనలో పడింది.

## మానవత్వానికి నిదర్శనంగా నిలిచిన కూటమి నాయకులు

- కాన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం
- తమ వంతు ఆర్థిక సహాయం అందజేసిన కందాపు శ్రీనివాస రావు కొంచాద చిన్నం నాయుడు ఉమామహేశ్వర రావు



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**మండలం రాపాక గ్రామానికి చెందిన టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు,జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నం నాయుడు , ఉమా మహేశ్వర రావు మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. రాపాక గ్రామానికి చెందిన సంచాన లక్ష్మి కాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో వారి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ విషయాన్ని ఆ వీధికి చెందిన పలువురు యువకులు కండాపు శ్రీనివాస రావు దృష్టికి తీసుకువచ్చారరు.దీనికి ఆయన సానుకూలంగా స్పందించి తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈయనతో పాటు కొంచాడ చిన్నం నాయుడు ,ఉమామహేశ్వర రావు ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు.. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. సంచాన లక్ష్మి కుటుంబ సమస్యను గ్రామ సమస్యగా భావించి రాపాక గ్రామ పెద్దలు యువకులు ,దాతలు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందజేసి కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

## నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది

-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు-



**బుట్టాయగూడెం జూన్26(ప్రజాజ్యోతి):-** నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బొరగం శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని బుసరాజుపల్లి టిడిపి నియోజకవర్గ క్యాంప్ కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు.నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు వ్యక్తిగత,సామాజిక సమస్యలపై వినతులను బొరగం శ్రీనివాసులు స్వీకరించి పరిశీలించారు.ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన పలు దరఖాస్తులను బొరగం శ్రీనివాసులు పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరితగతిన సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీలపై సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.ప్రతి ఒక్కరి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షులు యల్లాపు సురేష్,జిల్లా టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు, మార్కెట్ ఏఎంసి డైరెక్టర్ గద్దే సుబ్రమణ్యం, సుంకవల్లి చింటూ, నిమ్మ సత్యనారాయణ, కుంజా బాబురావు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రెండు రాష్ట్రాల డ్యాన్స్ టాలెంట్‌కు ఒకే వేదిక.. ‘సైరా ది వార్ ఆఫ్ డ్యాన్స్ 2026’ బ్రోచర్‌ను ఆవిష్కరించిన కూనవరం ఎస్ఐ బొడ్డు రామకృష్ణ

తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ నృత్య కళాకారులకు భారీ వేదిక.. నిర్వాహకులు కళ్యాణ్ సుమిత్రకు ఎస్ఐ అభినందనలు



**కూనవరం జూన్ 26 ప్రజా జ్యోతి కూనవరం:** రెండు తెలుగు రాష్ట్రాల ప్రతిభావంతులైన నృత్య కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న “సైరా ది వార్ ఆఫ్ డాన్స్ 2026” రెండు రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీల బ్రోచర్‌ను కూనవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీ బొడ్డు రామకృష్ణ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ బొడ్డు రామకృష్ణ మాట్లాడుతూ కళలు, సాంస్కృతిక రంగ అభివృద్ధికి ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ కళ్యాణ్--సుమిత్రలను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా మరిన్ని వినూత్న కార్యక్రమాలను నిర్వహించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులైన నృత్య కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ రెండు రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ పోటీలు వైభవంగా జరగనున్నాయని వెల్లడించారు.తమ కార్యక్రమానికి ప్రోత్సాహం అందిస్తూ బ్రోచర్‌ను ఆవిష్కరించిన కూనవరం ఎస్ఐ శ్రీ బొడ్డు రామకృష్ణకు నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో నృత్య కళాకారులు పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రోగ్రాం డైరెక్టర్ కొరియోగ్రాఫర్: డాక్టర్ కళ్యాణ్--సుమిత్ర సంప్రదించవలసిన నంబర్: 7702395571.

# వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి హౌస్ అరెస్ట్

**వందలాది మంది నాయకులు, కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు**



**గుంతకల్లు జూన్ 26 (ప్రజా జ్యోతి):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు,ఇటీవల తాడిపత్రి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవరెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ తాడిపత్రి పట్టణం లోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న శాంతియుత నిరాహార దీక్షలో పాల్గొనేందుకు గుంతకల్లు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సిద్ధమయ్యారు.గుంతకల్లు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, సమన్వయకర్త వై. వెంకటరామిరెడ్డి (వైవిఆర్) ఆదేశాల మేరకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్ పట్టణం, మండలం, అనుబంధ సంఘాల నాయకు లు, మహిళా, యువజన, రైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకు లు, కార్యకర్తలు వందలాదిగా వైవిఆర్ క్యాంపు కార్యాలయా నికి చేరుకుని తాడిపత్రికి బయలుదేరేందుకు సిద్ధమ య్యారు. తాడిపత్రి దీక్షకు నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా అడ్డుకునేందుకు తెల్లవారుజామునే పోలీసులు మఫ్టీలో వైవిఆర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని మోహరించారు. తాడిపత్రికి బయలుదేరేందుకు వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకుని ముందుకు వెళ్లకుండా నిలువరించారు. అయినప్ప టికీ నైరుతి రెడ్డి కార్యకర్తలతో కలిసి కారులో తాడిపత్రికి బయలుదేరేందుకు ప్రయత్నిం చగా, పోలీసులు కారును చుట్టుముట్టి అడ్డుకుని ముందుకు వెళ్లకుండా నిలిపి వేశారు. అనంతరం గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ఒకటవ పట్టణ సీఐ మనోహర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య నైరుతి రెడ్డి ని హౌస్ అరెస్ట్ చేసి బయటకు వెళ్ల కుండా నిరోధించారు. అలాగే వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను కూడా ఎక్కడికక్కడ అడ్డుకు ని తాడిపత్రికి వెళ్లకుండా నిలిపివేశారు. దీంతో వైవిఆర్ క్యాంపు కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నైరుతి రెడ్డి మాట్లాడుతూ “దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకో కుండా, శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకుల ను, కార్యకర్తలను అడ్డుకుని హౌస్ అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రజాస్వా మ్యంలో శాంతియుత నిరసన ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధ మైన హక్కు. ఆహక్కును కాలరాయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే. అధికార బలంతో ప్రతిపక్ష గొంతును అణచివేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదు. ప్రజల తరఫున మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది.కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజల సమస్యల పరిష్కారంపైనే ప్రభుత్వం దృష్టి సారించాలి. ప్రజాస్వా మ్యాన్ని అణచివేసే ప్రతి చర్యకు ప్రజలే తగిన సమ యంలో సమాధానం చెబుతారు.” అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గానికి చెందిన అనుబంధ సంఘాల నాయకులు, పట్టణ, మండల, గ్రామస్థాయి నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, రైతు నాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేయుటం అమ్మడం నేరం.సి. ఐ. గోపాల కృష్ణ



**చింతూరు జూన్ 26 ప్రజాజ్యోతి** గంజాయి అమ్మటం, సేవించటం, వారికి సహకరించటం నేరమని చింతూరు సీఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఏడుగురాళ్లపల్లి సంత మార్కెట్లో గిరిజన ప్రజలకు గంజాయి పై అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అమ్మకానికి, రవాణాకి సంబంధించి సంపాదించిన ఆస్తులపై ప్రభుత్వం జప్తు నిర్వహిస్తుందని సీఐ పేర్కొన్నారు. రోడ్డు భద్రత గూర్చి వివరించారు. పోలీసువున్న తాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏ.ఎస్.పి హేమంత్ కుమార్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు ప్రతి గ్రామాన నిర్వహిస్తున్నట్లు సిఐ తెలిపారు .యువతను ఉద్దేశించి ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ దుర్వ్యసనాల పట్ల యువత దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతి వేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చొని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడ దని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని .అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని . రోడ్డు భద్రత నియ మాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ తో యస్ ఐ సంతోష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్లూరు గ్రామం చెరువుముందరపల్లె లో ప్రజలు,కార్యకర్తలతో శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయ మమేకం





**రామాపురం జూన్ 26 ప్రజా జ్యోతి** రామాపురం మండలం చిట్లూరు గ్రామం చెరువుముందరపల్లె లో ప్రజలు కార్యకర్తల తో శుక్రవారంనాడు వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయంగా మమేకమయ్యారు. ఆయన అందరినీ పేరుపేరునా పలకరించారు.వైఎస్ఆర్ సిపి నాయ కుడు అవటాల ధర్మారెడ్డి కుమారుడు జగన్ మోహన్ రెడ్డి మోకాలికి చికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుచున్నారు. వారి నివాసానికి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి అతనిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ సిపి నాయకుడు అదిరెడ్డి నివాసంలో తేనీటి విందును శ్రీకాంత్ రెడ్డి స్వీకరించారు.మాజీ సర్పంచ్ మురళీ మోహన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ హరినాధ రెడ్డి,మాజీ సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషన్ రెడ్డి, నారాయణ రెడ్డి, బశిరెడ్డి, రసూల్ ఖాన్, ష,బీర్, సగినాల శివసంకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు అవగాహన కార్యక్రమం ఎమ్మెల్యే ఎంజీఆర్



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** మై టిడిపి యాప్ లో ఓటర్ డేటా నమోదు విధానంపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి - ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈరోజు కార్యక్రమం అమలుపై క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన అవగాహన సదస్సులో స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఎంజీఆర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రాధాన్యతతో పర్యవేక్షిస్తోందన్నారు. బి ఎల్ఓ లు సేకరిస్తున్న వివరాలతో పాటు పార్టీ తరఫున నియమితులైన బి యల్ ఎ లు కూడా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధృవీకరించిన సమాచారాన్ని మై టిడిపి యాప్ లో నమోదు చేయాలని సూచించారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, తప్పులు మరియు డూప్లికేట్ ఎంట్రీలు తొలగించేలా పార్టీ శ్రేణులు గ్రామ స్థాయి నుంచి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మై టిడిపి యాప్ లో ఓటర్ డేటాను నమోదు చేసే విధానం, సమాచార ధృవీకరణ ప్రక్రియ, డేటా అప్‌లోడ్ విధానాలపై క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జిలకు వివరంగా అవగాహన కల్పించారు.”ప్రతి ఓటు విలువైనది -- ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితమైనవిగా ఉండాలి” అనే లక్ష్యంతో సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఎంజీఆర్ గారు సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బి ఎల్ ఏ లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్ణపువాండ్లపల్లెలో యువతతో శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయ మమేకం



**రామాపురం జూన్ 26 ప్రజా జ్యోతి** రామాపురం మండలం కర్ణపువాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి యువతతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా యువతతో కలిసి స్థానిక అంశాలపై చర్చించి, వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ప్రాంత అభివృద్ధిపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. యువత ప్రజా సేవలో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## 100శాతం వాటర్ మ్యాపింగ్ లక్ష్యంతో ఇంటింటి సర్వే.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** నియోజకవర్గ కేంద్రంలో ముమ్మరంగా ఓటర్ మ్యాపింగ్ 100 శాతం వాటర్ మ్యాపింగ్ లక్ష్యంతో ఇంటింటి సర్వే. అర్హులందరికీ ఓటు హక్కు -- పారదర్శక ఓటరు జాబితా తయారీయే లక్ష్యం భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- సర్ 2026 ఓటర్ సర్వేలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు కూటమి ప్రభుత్వ అత్యున్నత ఆదేశాల మేరకు, పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ప్రత్యేక సూచనలతో పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియ అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రంలోని ..24,31,34,37 పోలింగ్ బూత్లలో జూన్ 30వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో ఇంటింటి ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని అత్యంత ముమ్మరంగా నిర్వహిస్తూ, ఎన్యుమరేషన్ ఫారాలను పకడ్బందీగా అందజేసి క్షుణ్ణంగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది.ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కు దుర్వినియోగం కాకుండా చూడాలనే సంకల్పంతో డూప్లికేట్ ఓట్లను గుర్తించి వేరు చేయడం, చనిపోయిన వారి పేర్లను ఓటర్ జాబితా నుండి శాశ్వతంగా తొలగించడం మరియు అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతనంగా ఓటు హక్కు కల్పించి ఎటువంటి తప్పులు లేని అత్యంత పారదర్శకమైన తుది జాబితాను ప్రచురించడమే ఏకైక లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వంద శాతం ఓటర్ మ్యాపింగ్ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు బి ఎల్ ఓ , బూత్ లెవెల్ ఏజెంట్లతో బి ఎల్ఏ తో పాటు తెలుగుదేశం పార్టీ టౌన్ ప్రెసిడెంట్ సైలాడ సతీష్, నీలమణి దుర్గమ్మ ఆలయం చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, కోట పాల్గొనరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపియస్ఎహెచ్ పిసి సభ్యుడిగా డాక్టర్ రెడ్డన్న



**రాయచోటి జూన్ 26 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ సభ్యుడిగా తనను ప్రభుత్వం నియమించి నట్లు రాయచోటి పట్టణానికి చెందిన కంటి వైద్యుడు జి. రెడ్డెన్న ఒక ప్రకటనలో తెలిపారు.ఏపి యస్ ఎ హెచ్ పిసి సభ్యుడిగా మూడేళ్ల పాటు కొనసాగను న్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం జనరల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. రెడ్డెన్న 40 సంవత్సరాలుగా కంటి వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం సురభి ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఆప్తాల్మిక్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలోని వందలాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకుచెందిన వేలాది మంది కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించారు. వ్యక్తిగ తం తో పాటు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా, అసిస్టెంట్ గవర్నర్గా పనిచేసి కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. కాగా రెడ్డన్న ఏపి యస్ ఎ హెచ్ పిసి రాష్ట్రస్థాయి సభ్యుడుగా ఎన్నిక కావడం పట్ల రాయచోటికి చెందిన పలువురు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బందితోపాటు పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## కోరుకొండ గ్రామంలో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం

**'డయల్-112'తో మీ భద్రత మా బాధ్యత.. కోరుకొండలో శక్తి టీమ్ అవగాహన సదస్సు.**



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) జూన్ 26::**26-06-2026 తేదీ న, పవిత్ర దేవాలయ ప్రాంగణంలో మహిళలు, యువతులు, చిన్నారుల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కోరుకొండ, తూర్పు గోదావరి జిల్లా పరిధిలో మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళలపై జరిగే వేధింపుల నివారణపై అవగాహన కల్పించేందుకు నార్త్ జోన్, తూర్పు గోదావరి జిల్లా శక్తి టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ డి. నరసింహ కిషోర్, (ఐ పి ఎస్) గారి ఆదేశాల మేరకు, డీఎస్పీ శ్రీమతి సి హెచ్. జీవన గారి పర్యవేక్షణలో శక్తి టీమ్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని, ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అలాగే మహిళల భద్రత కోసం రాష్ట్ర పోలీసు శాఖ చేపడుతున్న శక్తి టీమ్ సేవలు, మహిళల రక్షణకు అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవలు, చిన్నారుల భద్రత, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువత, విద్యార్థులు, గ్రామ పెద్దలు, శక్తి టీమ్ సిబ్బంది, పోలీసు అధికారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నార్త్ జోన్ శక్తి టీమ్, తూర్పు గోదావరి జిల్లా.

## బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం మండలంలోని క్యాంపు కార్యాలయంలో, వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మరియు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో పాతపట్నం మేజర్ పంచాయతీ బి ఎల్ఏ బూత్ లెవెల్ ఏజెంట్లతో ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా సర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పార్టీ శ్రేణులందరికీ ఈ ప్రక్రియ సులువుగా ఉండేందుకు మై బూత్ మై ఓటర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, దీనికి సంబంధించిన అవగాహన వీడియోను కూడా అందరికీ పంపించామని పేర్కొన్నారు.

## జనతా వారది అర్జీల పరిష్కారానికి పెద్ద పీట.

**జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు**



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** బీజేపీ అధిష్టానం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన జనతావారది అర్జీల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు.ప్రజాసమస్యల పరిష్కారానికి జనతావారధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి జనతావారది ఒక వారధి అవుతామన్నారు. శ్రీకాకుళం జిల్లా బీజేపీ కార్యాలయం లో శుక్రవారం ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యల పరిస్కారమే ధ్యేయంగా జనతావారది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో జనతా వారది కో కన్వీనర్ ఎర్రగుంట్ల జగన్మోహన్ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలివి కరుణాకర్ , నరసన్నపేట నియోజకవర్గ బి ఎల్ ఎ 1 పోకతోట సింహాచలం , పాతపట్నం నియోజకవర్గబి ఎల్ ఎ 1 సిరిపురం త్రివేణి జిల్లా బిల్డింగ్ కమిటీ కో కన్వీనర్ పైడి హరిగారు, శ్రీకాకుళం ఈస్ట్ మండల అధ్యక్షురాలు కనుగుల లలితకుమారి , సంతోష్ తదితరులు పాల్గున్నారు.

# సీఎస్‌కు కీలక పదవి
# కేసీఆర్ బాటలో రేవంత్

**హైదరాబాద్ :** ఎం రేవంత్ రెడ్డి సలహాదారుగా ప్రస్తుత సీఎస్ కే రామకృష్ణారావును నియమించారు. అయితే రామకృష్ణారావు ప్రస్తుతం సీఎస్‌గా పనిచేస్తుండగా.. ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. పదవీ విరమణ తర్వాత ఆయన సీఎంకు సలహాదారుగా వ్యవహరించనున్నారు. అయితే గతంలో మాజీ సీఎం కేసీఆర్ కూడా.. ఇలా పదవీ విరమణ చేసిన సీఎస్‌లను తన సలహాదారులుగా నియమించుకు న్నారు. ఇప్పుడు అదే బాటలో సీఎం రేవంత్ రెడ్డి నడుస్తుండటం గమనార్హం.తెలంగాణ ప్రభుత్వం ఒకే రోజు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈనెల 30వ తేదీతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు పదవీ కాలం ముగియనుండటంతో.. కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ కీలక ఉత్తర్వులు వెలువరించింది. అదే సమయంలో పదవీ విరమణ తర్వాత రామకృష్ణారావుకు కీలక పదవి కూడా అప్పగించింది. ముఖ్యమంత్రి సలహాదారుగా కే రామకృష్ణారావును నియమిస్తూ.. ప్రకటన విడుదల చేసింది. అయితే గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కూడా.. తన హయాంలో ఇలాగే రిటైర్ అయిన సీఎస్‌లను ప్రభుత్వ సలహాదారులుగా నియమించారు. ఈ క్రమంలోనే అప్పుడు కేసీఆర్ అనుసరించిన మార్గాన్నే ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అనుసరిస్తున్నారు అంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుగా నియమిస్తూ.. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎం. రఘునందన్ రావు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు వెలువరించారు. రామకృష్ణారావు ఈనెల 30వ తేదీన రిటైర్ అయిన వెంటనే ముఖ్యమంత్రికి సలహాదారుతో పాటు ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన



జీవోలో వెల్లడించింది.ఈ క్రమంలోనే సీఎం సలహాదారుగా కే రామకృష్ణారావు నియామక కాలపరిమితితోపాటు.. ఆయనకు ఇచ్చే జీతభత్యాలు.. ఇతర సేవా నిబంధనలు, కండీషన్లను త్వరలోనే జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు.. పదవీ విరమణ తర్వాత కీలక బాధ్యతలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పగించారు. ఇలా రిటైర్ అయిన సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించే సాంప్రదాయాన్ని కేసీఆర్ తీసుకొచ్చారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ రాజీవ్ శర్మ.. 2016 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఆ వెంటనే.. డాక్టర్ రాజీవ్ శర్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కేసీఆర్ నియమించారు. ఈ క్రమంలోనే ఆయనకు కేబినెట్ హోదాను కూడా కల్పించారు. కేసీఆర్‌కు అత్యంత నమ్మకస్తుడైన ఐఏఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న సోమేష్ కుమార్‌కు కూడా కేసీఆర్ పదవి ఇచ్చారు. క్యాట్ ఆర్డర్ వివాదంలో తెలంగాణ హైకోర్టు తీర్పు కారణంగా ఆయన 2023 జనవరిలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వెళ్లిన సోమేష్ కుమార్.. ఆ తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారు. ఈ క్రమంలోనే సోమేష్ కుమార్ వీఆర్ఎస్ తీసుకున్న వెంటనే 2023 మేలో ఆయనను సీఎం ముఖ్య సలహాదారుగా నియమించారు. సోమేష్ కుమార్‌కు కేబినెట్ హోదా ఇచ్చి 3 ఏళ్ల కాలపరిమితితో ఆ పదవిలో నియమించారు.రాజీవ్ శర్మ తర్వాత తెలంగాణ సీఎస్‌గా పనిచేసిన ఎస్కే జోషి కూడా పదవీ విరమణ చేసిన వెంటనే కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమితులు అయ్యారు. ఇక కేవలం ఐఏఎస్ అధికారులే కాకుండా.. ఐపీఎస్ అధికారులకు కూడా రిటైర్మెంట్ తర్వాత పదవులు దక్కాయి. తెలంగాణ తొలి డీజీపీగా పనిచేసిన అనురాగ్ శర్మ.. పదవీ విరమణ చేసిన వెంటనే ఆయనను హోంశాఖ సలహాదారుగా కేసీఆర్ ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వాలు మారినా లేక పరిపాలనలో వేగం పెంచాలన్నా.. సీనియర్ అధికారుల సుదీర్ఘ అనుభవం, కీలక శాఖలైన ఆర్థిక, శాంతిభద్రతలు, నీటిపారుదలపై వారికి ఉన్న పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో అవసరం ఉంటుంది. అందుకే వారు రిటై ర్మెంట్ అయిన తర్వాత కూడా.. ప్రభుత్వ అవసరాల మేరకు వారికి ప్రత్యేక పదవులు ఇస్తూ ఉంటారు. అంతేకాకుండా.. ప్రభుత్వాల్లో కీలకమైన పాలనాపరమైన లూప్‌హోల్స్, బడ్జెట్ రహస్యాలు, రాజకీయ వ్యూహాలు తెలిసి ఉన్న నమ్మకమైన అధికారులను రిటైర్మెంట్ తర్వాత వదిలే యకుండా.. తమతోనే ఉంచుకోవడానికి ముఖ్యమం త్రులు, ప్రభుత్వాలు వారికి ఇలాంటి పదవులను కట్టబెట్టి ఘనంగా వీడ్కోలు ఇస్తుంటారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి
# అందరూ భాగస్వాములు కావాలి

**అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్**

**ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి,**

**మహబూబ్ నగర్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది విద్యార్థులు, వాకర్స్, యువత, మహిళలు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దుష్ప్రవర్తన అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు మళ్లే యువత తమ జీవితాలను, కుటుంబాల ఆశలను, సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణం వ్యాపార, విద్యా మరియు రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉండటంతో, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారని, ఈ పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాకు అవకాశాలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా అందరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజికంగా తీవ్రమైన నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి క్రమంగా




కుటుంబానికి దూరమవడమే కాకుండా నేరప్రవర్తన వైపు వెళ్లే ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు. మహబూబ్నగర్ జిల్లాను పూర్తిగా డ్రగ్-ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడం పోలీసు శాఖ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరి సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. తదుపరి మినీ స్టేడియం నుండి నేతాజీ చౌరస్తా వరకు భారీ వాకథాన్ ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీ మొత్తం డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సందడి చేసింది. నేతాజీ చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ గారు అందరితో కలిసి మాదకద్రవ్యాల వినియోగాన్ని దూరం పెట్టాలని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మినీ స్టేడియంకు తిరిగి చేరుకున్న తర్వాత విద్యార్థులు, ప్రజలు మానవహారంగా నిలబడి మాదకద్రవ్యాల నిర్మూలనకు మద్దతుగా పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతులకు శుభవార్త
# ఒకేసారి 'రైతుభరోసా' నిధులు రిలీజ్

**హైదరాబాద్ :** తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఈసారి రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధులను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున, రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 12 వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.ఈ వానాకాలం సీజన్‌లో రైతుభరోసా లబ్ధి పొందడానికి ప్రభుత్వం కీలక విధివిధానాలను ఖరారు చేసింది. ఈ నెల 15వ తేదీ నాటికి 'భూభారతి' పోర్టల్‌లో భూమి వివరాలు నమోదై, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సీసీఎల్ఏ నుంచి అనుమతులు పొందిన రైతులకు మాత్రమే ఈ సాయం అందుతుంది. అలాగే, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులు కూడా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నుంచి అనుమతులు పొంది ఉండాలి. అర్హులైన రైతుల రికార్డులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఒక జిల్లా పరిధిలోనే దాదాపు 3.58 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉండగా, వారి కోసం రూ. 460 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జాబితాలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 3,906 మంది రైతులు కూడా ఉన్నారు.



# డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు

**యువత, విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి**
**తమ భవిష్యత్ ప్రణాళిక వైపు పయనించాలి**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం**
**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ**
**ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు×**
**డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ**




**రాజన్న సిరిసిల్ల :** డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ మీదుగా పద్మనాయక కల్యాణ మండపం వరకు నిర్వహించారు.అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, నష్టాలపై స్కూల్ విద్యార్థులు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ స్టాళ్లను అతిథులు పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు

**పిల్లల భద్రత.. డ్రగ్స్‌కు అడ్డుకట్ట**


సే నో టూ డ్రగ్స్.. సే ఎస్ టూ లైఫ్ నినాదాలు చేశారుఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన చేశారని గుర్తు చేశారు ఇందులో భాగంగా డ్రగ్స్ ను నిర్మూలించేందుకు రాష్ట్రంలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తుందని తెలిపారు. యువత, విద్యార్థులకు డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు.యువత సన్మార్గంలో వెళ్లేలా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. యువత విద్యార్థులు మత్తు పదార్థాల బాట ను వీడండి.. మైదానం బాట పట్టండి అని సీఎం పిలుపు నిచ్చారని గుర్తు చేశారు. యువత సన్మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ పై దాడులు, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు.పోలీస్ శాఖ శాంతి భద్రతల తో పాటు పోలీసులు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారని, హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు.యువత, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా ఒలింపిక్స్ లో పతకాలు సాధించేలా రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకువచ్చారని తెలిపారు. అలాగే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సీఎం కప్ పేరిట జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించి నైపుణ్యం ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వచ్చేలా కృషి చేశారని అభినందించారు. యువత, విద్యార్థులు ఏదో ఒక హాబీ తో ఉండాలని సూచించారు.

# చరిత్రగా ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర ఐటీ రంగానికి పునాది వేసిన మొట్టమొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం చరిత్రగా మారిపోనుంది. అమెరికాకు చెందిన ఈ బహుళజాతి సంస్థ 1987లో బేగంపేట కేంద్రంగా నగరంలోనే మొదటి ఐటీ కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే.. ఇటీవల ఈ భవనంలోని భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీన్ని పూర్తిగా కూల్చివేస్తోంది. ఒకప్పటి ఐటీ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ ఐకానిక్ భవనం స్థానంలో సరికొత్త కమర్షియల్ బిల్డింగ్ నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.నేటి తరం యువతకు ఐటీ కారిడార్, హైటెక్‌సిటీ అనగానే అందరికీ గుర్తొచ్చే ఏరియాలు మాదాపూర్, గచిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే గగనతలాలు, అత్యాధునిక గ్లాస్ బిల్డింగులే నేటి ఐటీ నగర రూపురేఖలు. కానీ.. హైదరాబాద్ నగరానికి చెందిన మొదటి తరం ఐటీ ఉద్యోగులను, అనుభవజ్ఞులను అడిగితే వారికి మొదటగా గుర్తొచ్చే ప్రాంతం బేగంపేట. ఎందుకంటే భాగ్యనగరంలో ఐటీ సామ్రాజ్యానికి తొలి పునాది పడింది ఇక్కడే. నగరంలోనే నిర్మితమైన మొట్టమొదటి ఐటీ టవర్‌గా ఖ్యాతిగాంచిన ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతోంది. ఆ ఐటీ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యాజమాన్యం రెడీ అయింది.అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ 1987లో బేగంపేటలో ఐటీ టవర్ నిర్మించింది. నగరంలో స్థాపించబడిన మొట్టమొదటి అంతర్జాతీయ బహుళజాతి సంస్థ ఇదే కావడం విశేషం. ఐటీ రంగంలో హైదరాబాద్ పేరు గ్లోబల్ మ్యాప్‌పైకి ఎక్కడానికి ఈ సంస్థే తొలి కారణం. దశాబ్దాల పాటు ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసిన ఈ ఐకానిక్ భవనం ఇప్పుడు శాశ్వతంగా కనుమరుగవుతోంది. భవన భూగర్భంలో ఉన్న నీటి సంపు దెబ్బతినడం, పునాదులు బలహీనపడటంతో భవన భద్రతను దృష్టిలో ఉంచుకుని దానిని కూల్చివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కూల్చివేత పనులు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించిన అనంతరం.. అదే స్థలంలో సరికొత్త అధునాతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌ను నిర్మించి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ దేశీయ ఐటీ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించేంత వరకు నగర ఐటీ రంగానికి బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అప్పట్లో అంతర్జాతీయ ప్రయాణాలకు అత్యంత అనువుగా.. నగర నడిబొడ్డున బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా ఎదగడానికి ప్రధాన కారణమైంది. ఆ రోజుల్లో బ్రిగేడ్, టాటా సెర్విజోల్, విప్రో ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి దిగ్గజ సంస్థలన్నీ బేగంపేట కేంద్రంగానే తమ కార్యకలాపాలను సాగించాయి.వీటితో పాటు మేఫైర్, సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లలో సత్యం కంప్యూటర్స్ సంస్థ తన కార్యకలాపాలను నడపగా.. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో హెచ్ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజిగూడ కేంద్రంగా ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు నగరంలో ఐటీ విప్లవానికి ఊతమిచ్చాయి. నాడు కొన్ని వందల మందితో ప్రారంభమైన ఐటీ ఉద్యోగుల ప్రస్థానం.. నేడు లక్షల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరింది. ఎందరో మొదటి తరం సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉపాధినిచ్చి, జీవితాలను నిలబెట్టిన హైదరాబాద్ మొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ భవనం నేడు జ్ఞాపకంగా మిగిలిపోతుండటంతో పాత తరం టెక్కీలు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు.

# అంత్యోదయ పథకంలో మార్పులు



**వరంగల్ :** దేశంలోని అత్యంత నిరుపేద కుటుంబాల ఆహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి 35 కిలోల బియ్యం లేదా గోధుమలను అందిస్తున్నారు. తాజాగా, ఈ పథకంలో మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇకపై పేద కుటుంబాల్లోని సభ్యుల సంఖ్యను బట్టి రేషన్ పంపిణీ చేయనున్నారు. ఈ కార్డు ఉన్నవారికి ఒక్కొక్కరికీ 7 కిలోలు చొప్పున ఇద్దరు ఉంటే 14 కిలోల ఇస్తారు. ఐదుగురు, ఆపై ఎక్కువ ఉంటే ప్రస్తుతం ఇచ్చే 35 కిలోలు కొనసాగుతాయి.అంత్యోదయ అన్న యోజన పథకంలో కేంద్రం కీలక మార్పులు తీసుకురానుంది. ఈ పథకం కింద లబ్దిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు అందజేసేలా మార్పులు చేయబోతోంది. ప్రస్తుతం ఉన్న 35 కిలోల గరిష్ఠ పరిమితిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను సవరించేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ.. జులై 13 వరకు గడువు విధించింది.ప్రస్తుతం అత్యంత నిరుపేద కుటుంబాలకు అంత్యోదయ అన్న యోజన పథకం కింద సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఇస్తున్నారు. అదే, సాధారణ రేషన్‌కార్డుదారులకు ఒక్కో వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున అందిస్తున్నారు. కానీ, మార్పుల తర్వాత అంత్యోదయ కార్డుదారులు కుటుంబంలో ఇద్దరే ఉంటే వారికి 14 కిలోలు ఆహారధాన్యాలు మాత్రమే లభిస్తాయి. ఐదుగురు లేదా అంతకు మించి ఉన్నా 35 కిలోలు పంపిణీ చేస్తారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ తగిన పరిమాణంలో ఆహారధాన్యాలను అందజేయడమే ఈ సవరణ ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రస్తుత విధానం వల్ల ఎక్కువ మంది అంత్యోదయ అన్న యోజన కుటుంబాలు, సాధారణ రేషన్‌కార్డు కేటగిరీ కంటే తలసరి తక్కువ రేషన్‌ను పొందుతున్నాయి. వాస్తవానికి ప్రయారిటీ హౌస్‌హోల్డ్ కేటగిరీ అనేది అంత్యోదయ లబ్ధిదారుల కంటే తక్కువ నిరుపేదలుగా ఉన్నవారి కోసం ఉద్దేశించబడింది"అంత్యోదయ అన్న యోజన కింద ప్రస్తుతం ఉన్న 'కుటుంబ ఆధారిత రేషన్ విధానం' అత్యంత నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో తెచ్చినప్పటికీ, ఇది కుటుంబ పరిమాణాన్ని బట్టి లబ్ధిదారుల మధ్య తీవ్ర అసమానతలకు దారితీస్తోంది" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. చిన్న కుటుంబాలకు వచ్చే రేషన్ పరిమాణంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. కానీ పెద్ద కుటుంబాల సభ్యుల సంఖ్యకు అనుగుణంగా రేషన్ కేటాయింపులు పెరుగుతాయి కాబట్టి వారు దీని వల్ల లబ్ధి పొందుతారు.జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 లక్ష్యాలకు అనుగుణంగా సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని తగినంత పరిమాణంలో అందించడం ద్వారా ఆహార, పోషకాహార భద్రతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న విస్తృత విధానంలో భాగంగానే ఈ సవరణను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం, ప్రయారిటీ హౌస్‌హోల్డ్స్, అంత్యోదయ అన్న యోజన లబ్ధిదారులిద్దరికీ బియ్యం లేదా గోధుమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

## పాతపట్నంలో విస్తృతంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.** శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండల కేంద్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమం విస్తృత స్థాయిలో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా కోర్టు జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు ఓటరు వివరాల పరిశీలన, నమోదు ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని స్థానిక నాయకులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. బీఎల్‌ఓలు ప్రజలతో మమేకమై వారి సందేహాలను ఎలా నివృత్తి చేస్తున్నారో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అవసరమైన పత్రాల సమర్పణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. ప్రస్తుత 2026 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో ఓటరు పేరు లేకపోతే, 2002 సంవత్సరం నుంచి తల్లిదండ్రుల ఓటరు వివరాలు లేదా సంబంధిత పోలింగ్ బూత్ సమాచారం అందజేస్తే, అర్హతను పరిశీలించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసే అవకాశం ఉంటుందని ప్రజలకు వివరించారు. అవసరమైన పత్రాలను బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు శైలద సతీష్, నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం చైర్మన్ అక్కాంధ్ర సన్యాసి, కోర్టు జంక్షన్‌కు చెందిన చందు, తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్త సాసు పల్లి శంకర్, కూటమి నాయకులు పాల్గొని బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలకు సహకరిస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు అందించారు.

## తులం బంగారం కాదు కదా..
## తులం ఇనుము కూడా ఇవ్వరు

**హైదరాబాద్ :** తెలంగాణ రేవంత్‌రెడ్డి మహిళలకు తులం బంగారం కాదు కదా,తులం ఇనుము కూడా ఇవ్వరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శుక్రవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చేయలేదని, ప్రతి పంటకు బోనస్ ఇస్తానని ఇవ్వలేదన్నారు. రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని మోసం చేశారని, విద్య భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు కాదు ముందు లక్షాధికారులను చేయండి చాలు అని ఎద్దేవా చేశారు.

## వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు

**సర్ ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలి**
**టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్**

**హైద్రాబాద్ :** సర్ ప్రాముఖ్యత అందరూతెలుసుకోవాలని,వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు రాజ్యాంగం మనకి కనిపించిందనిటీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్‌అన్నారు.శుక్రవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ పాస్పోర్ట్ అనేది కూడా సిటిజెన్ షిప్ కాదు అంటున్నారూ బీజేపీ మెంబెర్ షిప్ ఉంటేనే సిటిజెన్ గా కన్సిడర్ చేస్తున్నారు ఇతర రాష్ట్రాల లో నాఎఖీ పేరుతో బీజేపీ ఎలా అధికారం లోకి వస్తుందో మనం చూసాం ఇప్పటి వరకు 8 సార్లు నాఎఖీ ప్రక్రియ జరిగింది దేశం లో తెలంగాణ మా టార్గెట్ అని బీజేపీ నేతలుమాట్లాడుతున్నారు బీజేపీ వోట్ చోరీ , ఈవీఎం చోరీ , సీటు చోరీతో పాటు, పార్టీ చోరీ , రాముని గుడి చందా చోరీ కూడా చేస్తుందని విమర్శించారు.వోట్ అప్డై చేసుకోవటం అందరి బాధ్యత, అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జగదీష్ కోరారు

## షేర్‌గూడలో ఉచిత మెడికల్ క్యాంప్
## ప్రజలకు వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ

**రంగారెడ్డి :** డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షేర్‌గూడ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు మరియు వాలంటీర్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్స్ గ్యుటీ మెంబర్ జి.మాధవి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రగ్స్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

**గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి**

**వరంగల్ :** డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం బాధ్యతే కాదు తల్లితండ్రులు వైద్యులు పోలీసులు మేధావులు స్వచ్ఛంద సంస్థలు సినీ ప్రముఖులుఉపాధ్యాయులు అందరి బాధ్యత అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అని అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అరికట్టాలంటే నార్కోటి కంట్రోల్ రూమ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నార్కటి కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రగ్స్ ని అమ్మేవారిని పై కఠిన చర్యలు తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్ ద్వారా మంచి మార్గంలో నడిచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుంది జిల్లాలలో కమిషనర్ ఎస్పీ కలెక్టర్ వాళ్లు చెరువుతో మాదకద్రవ్యాలను అరికట్టడం అర్షనీయం ముఖ్యంగా సప్లై చేస్తే ఏరియాలో కాలేజీలు సినిమా హాలు కేసులు క్లబ్బులు హాస్టల్స్ దగ్గర నిఘా ఏర్పాటు చేయాలి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా కాకుండా బార్డర్లలో సరైన జాగ్రత్తలు తీసుకొని ఎవరైతే గంజాయి రవాణా చేస్తారో వారిని పట్టుకొని వారిపై కఠిన చర్యలుతీసుకోవాల్సిందిగా కోరుతున్నాను డ్రగ్స్ అంతరించాలంటే మాదకద్రవ్యాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరు వారి భుజాల మీద వేసుకొని దానిపై పోరాడితేనే తప్ప అది అరికట్టలేమని రాజనాల శ్రీహరి అన్నారు వెంటనే ప్రభుత్వం ప్రజలు అధికారులు అందరూ చొరవతో డ్రగ్స్ ను గంజాయిని మాదకద్రవ్యాలను అరికట్టాల్సిందిగా రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్ తులసి శశి మాగంటి శివగంద్రకోట రామచందర్ లో పాల్గొన్నారు

## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

**హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు ..

## బిజినెస్

### భారత్‌లో కొత్త మోటార్‌సైకిళ్ల తయారీ!



అమెరికాకు చెందిన ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్, భారతీయ ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి. ఇరు సంస్థలు కలిసి ఎంట్రీ లెవల్ పెర్ఫార్మెన్స్ మోటార్‌సైకిళ్లు, క్రూయిజర్ మోడళ్లను సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయి. వీటిని భారతదేశంలోనే తయారు చేస్తారు. ఇక్కడి నుండి అంతర్జాతీయంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు ఎగుమతి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

**హార్లే 'బ్యాక్ టు బ్రిక్స్' వ్యూహం**

2019 నుంచి 2025 మధ్య కాలంలో హార్లే డేవిడ్‌సన్ అంతర్జాతీయ రిటైల్ విక్రయాలు 40 శాతం తగ్గాయి. దీంతో కంపెనీ మార్జిన్లు 18% దెబ్బతిన్నాయి. డీలర్ల లాభాలు ఏకంగా 80% మేర క్షీణించాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు 'బ్యాక్ టు బ్రిక్స్' పేరుతో కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ప్లాట్‌ఫారమ్‌ల ఆధారంగా రాబోయే మూడేళ్లలో 20 కొత్త మోడళ్లు, వేరియంట్లను మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ప్రీమియం విభాగంలో మరింత విస్తృతంగా వినియోగదారులను చేరుకోవాలని కంపెనీ భావిస్తోంది.

**వ్యూహాత్మకంగా భారత్‌లోకి రీఎంట్రీ**

హార్లే డేవిడ్‌సన్ 2011లో హర్యానాలోని బావల్‌లో ప్లాంట్ ఏర్పాటు చేసింది. నష్టాల కారణంగా 2019లో భారత్‌లో తయారీ కార్యకలాపాలను నిలిపివేసింది. తర్వాత 2020లో హీరో మోటోకార్ప్‌తో లైసెన్సింగ్, పంపిణీ ఒప్పందం కుదుర్చుకుంది. డీల్‌లో భాగంగా మోటార్‌సైకిళ్ల విక్రయం, సర?వసింగ్‌తో పాటు సంయుక్తంగా కొత్త మోడళ్ల రూపకల్పన, తయారీ చేపట్టాలని నిర్ణయించారు. ఈ భాగస్వామ్యంలో తొలి ఉత్పత్తిగా వచ?చన హెచ్‌డీ ఎక్స్440 ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.35 లక్షల నుంచి ప్రారంభమవుతోంది. ఇదే ప్లాట్‌ఫారమ్‌పై హీరో మావ్రిక్ పేరుతో మరో మోడల్‌ను విక్రయిస్తోంది. ఇప్పుడు ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ ఎగుమతుల దిశగా కీలక అడుగులు వేస్తోంది. వ్యాపారణ విస్తరణ వ్యూహంపై హార్లే డేవిడ్‌సన్ స్పందిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తమ బ్రాండ్ విస్తరణకు హీరో మోటోకార్ప్ కీలక భాగస్వామి అని పేర్కొంది. అయితే కొత్త ఉత్పత్తులపై పూర్తి వివరాలను వెల్లడించలేదు. మరోవైపు హీరో మోటోకార్ప్ సీఈఓ హర్షవర్ధన్ చితాలే మాట్లాడుతూ, ఈ ఏడాది మరిన్ని హార్లే బ్రాండెడ్ మోటార్‌సైకిళ్లు విడుదలవుతాయని ధృవీకరించారు. గ్లోబల్ మార్కెట్లలో అనుకూలత ఉంటే భారత్‌లో తయారైన మోడళ్లను ఇతర దేశాల్లో విక్రయించే నిర్ణయం పూర్తిగా హార్లే--డేవిడ్‌సన్‌దేనని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్స్440, హీరో మావ్రిక్ మోడళ్లు కలిపి దేశంలో 14,375 యూనిట్లు అమ్ముడయ్యాయి. 350సీసీ - 500సీసీ విభాగంలో సుమారు 11 శాతం మార్కెట్ వాటాతో, హీరో మోటోకార్ప్ ప్రస్తుతం బజాజ్ ఆటో, రాయల్ ఎన్‌ఫీల్డ్ తర్వాత మూడో అతిపెద్ద సంస్థగా నిలిచింది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం, ఈ ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో ఆపరేటింగ్ మార్జిన్లు సాఫ్ట్‌వేర్ ఎగుమతుల కంటే అధికంగా ఉండటం గమనార్హం.

**ఏడాది చివర్లో 'హార్లే--డేవిడ్‌సన్ స్ప్రింట్'**

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న హార్లే-డేవిడ్‌సన్ ఎక్స్440, హీరో మావ్రిక్ మోడళ్లకు మంచి ఆదరణ లభించడంతో ప్రస్తు ఆర్థిక సంవత్సరంలో మరిన్ని కొత్త మోడళ్లను విడుదల చేయాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. వీటిలో తొలి మోడల్‌గా 'హార్లే--డేవిడ్‌సన్ స్ప్రింట్' ఈ ఏడాది చివర్లో మార్కెట్లోకి వచ్చే అవకాశముంది. అనంతరం దశలవారీగా మరిన్ని మోడళ్లను ప్రవేశపెట్టనున్నారు. వీటిలో కొన్ని మోడళ్లను భారత్ నుంచి తొలిసారిగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నట్లు పరిశ్రమ వర్గాల సమాచారం.

# రివర్స్ గేర్‌లో గోల్డ్, సిల్వర్.. క్రమేణా తగ్గుముఖం పడుతున్న ధరలు



**న్యూఢిల్లీ :** బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతకొద్ది నెలలుగా ఆకాశమే హద్దు అన్నట్టు దూసుకుపోయిన రేట్లు.. ఇప్పుడు అంతే వేగంతో దిగొస్తున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గడిచిన దశాబ్దంలోనే ఎన్నడూలేనంతగా గోల్డ్ విలువ క్షీణించింది. ఇప్పటిదాకా 12 శాతం రేట్లు పడిపోయాయి. 2016 డిసెంబర్ నుంచి చూస్తే.. 3 నెలల వ్యవధిలో ఈ స్థాయిలో ధరల క్షీణత ఇదే. సిల్వర్ వాల్యూ సైతం నాలుగేండ్లలో భారీ పతనాన్ని చవిచూసింది. 17.6 శాతం తగ్గింది. 2022 జూన్ తర్వాత ఇప్పుడే ఇంతటి క్షీణత అంటున్నాయి మార్కెట్ వర్గాలు. నిజానికి వరుసగా 15 నెలలు పరుగులు పెట్టిన పుత్తడి, వెండి ధరలు.. ఒక్కసారిగా రివర్స్ గేర్‌లోకి వెళ్లడంతో మార్కెట్‌లోనూ స్తబ్ధత నెలకొన్నది. కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారు మరి.

**అంతర్జాతీయ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ధరల పతనం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది జనవరి 28న ఔన్స్ గోల్డ్ ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ 5,417 డాలర్లు పలికింది. సిల్వర్ తొలిసారి 117 డాలర్లుగా నమోదైంది. అయితే ఇప్పుడున్న ధరలతో పోల్చితే బంగారం 24 శాతం, వెండి దాదాపు 47 శాతం తగ్గాయి. ప్రస్తుత ట్రెండ్‌నుబట్టి ఇంకా తగ్గవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే భారతీయ మార్కెట్‌లోనూ రేట్లు మరింత దిగివస్తాయన్న అభిప్రాయాలు మార్కెట్ నిపుణుల్లో వ్యక్తమవుతున్నాయి.

**నిపుణుల మాటేంటి?**

అమెరికా డాలర్ బలపడటం, యూఎస్ బాండ్ ఈల్డ్స్ పెరుగడం, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు అంచనాలు.. బంగారం, వెండి ధరల్ని కిందికి లాగుతున్నాయని మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల మాట. ఇన్నాళ్లూ తమ పెట్టుబడులకు రక్షణ కవచంగా గోల్డ్, సిల్వర్‌ను భావించిన మదుపర్లు.. వాటిని ఎడాపెడా కొనేశారు. అయితే తిరిగి అమ్మకాలకు దిగుతుండటం కూడా డిమాండ్‌ను దెబ్బ తీస్తున్నదని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక స్టాక్ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడి సైతం గోల్డ్, సిల్వర్ రేట్లను దిగజార్చుతున్నాయని చెప్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం భయాలూ డౌన్ ట్రెండ్‌కు దారితీస్తున్నాయి. ఇదిలావుంటే అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఏర్పడిన సంక్షోభం కూడా గోల్డ్, సిల్వర్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభించిన సంగతి విదితమే. ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాల్లో క్రూడాయిల్, గ్యాస్ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. అందుకే డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక రేట్లు పరుగులు పెట్టాయి. అయితే అమెరికా-ఇరాన్ డీల్.. పరిస్థితుల్ని కొంతమేర అదుపులోకి తెచ్చాయి. దీంతో ముడి చమురు రేట్లూ దిగువముఖం పట్టాయి. ఫలితంగా అధిక ఇంధన ధరలతో ద్రవ్యోల్బణం భయాల మధ్య బంగారం, వెండి కొనుగోలు కోసం ఎగబడ్డ మదుపర్లు.. ఒక్కసారిగా వాటిని అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది కూడా ధరల క్షీణతకు కారణమేనన్న అభిప్రాయాలున్నాయి. గల్ఫ్ వార్‌కు ముగింపు కార్డుపడితే మార్కెట్‌లో పెద్ద కరెక్షనే ఉంటుందన్న అంచనాలూ వస్తుండటం గమనార్హం.

**స్పాట్ మార్కెట్‌లో మరింత తగ్గిన ధరలు**

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల పతనం కొనసాగుతున్నది. గత మూడు రోజుల్లో 24 క్యారెట్ తులం పుత్తడి రేటు రూ.7,000 పడిపోగా, కిలో వెండి విలువ రూ.19,500 క్షీణించింది. గురువారం ఢిల్లీలో పసిడి ధర రూ.2,800 దిగి రూ.1,45,300గా ఉన్నది. అలాగే వెండి రేటు కిలో రూ.5,000 పడిపోయి రూ.2, 26,000గా నమోదైంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ గోల్డ్ రూ.1,450 తగ్గి రూ.1,29, 550 వద్ద నిలిచింది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 21.15 డాలర్లు క్షీణించి 3,978.06 డాలర్లుగా ఉన్నది. సిల్వర్ 57.10 డాలర్లుగా ట్రేడైంది.

ఈ ఏడాది జనవరి-మార్చిలో 10 శాతం పెరిగిన బంగారం ధర.

ఈ జనవరి-ఫిబ్రవరిలో 28 శాతం ఎగిసిన వెండి రేటు.

జనవరి 29న గోల్డ్, సిల్వర్ రేట్లు ఆల్‌టైమ్ హైగా నమోదు. రూ.1,83,000 పలికిన తులం పుత్తడి, రూ.4,04,500 చేరిన కిలో వెండి.

2025లో 65 శాతం, 2024లో 28 శాతం పుంజుకున్న పసిడి విలువ. వెండి ధరలూ 148 శాతం, 22 శాతం చొప్పున పెరుగుదల.

గత ఏడాది 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.58,750, కిలో వెండి రేటు రూ.1,49,300 వృద్ధి.

### ఆసియా మార్కెట్ల భారీ పతనం.. ఎందుకీ బ్లడ్‌బాత్?



ఇంటర్నెట్ డెస్క్: ఆసియా స్టాక్ మార్కెట్లు నేడు భారీగా కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా బెంచ్ మార్కెట్ ఇండెక్స్ కోస్పీ ఏకంగా 8 శాతం మేర పతనం కాగా.. జపాన్‌కు చెందిన నిక్కీ 5 శాతం మేర క్షీణించింది. టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఈ పతనానికి కారణమయ్యాయి. నేడు మన మార్కెట్‌లకు సెలవు కావడం గమనార్హం. గిఫ్ట్ నిఫ్టీ మాత్రం శుక్రవారం ఉదయం 100 పాయింట్ల మేర క్షీణించింది. శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషనల్‌లో కోస్పీ దాదాపు 8.2 శాతం మేర పతనమైంది. దీంతో ట్రేడింగ్‌ను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. అటు జపాన్ నిక్కీ సైతం 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, చైనా బ్లూచిప్ సీఎస్ఐ300 ఇండెక్స్ 2.9 శాతం, షాంఘై కాంపోజిట్ సైతం 2 శాతం మేర క్షీణించాయి. జూన్ 23న కూడా ఇదే తరహాలో ఆసియా మార్కెట్‌లో అమ్మకాలు కనిపించాయి. నేడు మళ్లీ అదే స్థాయిలో మార్కెట్లు పడిపోయాయి. మెమొరీ, స్టోరేజీ చిప్‌ల ధరల కారణంగా యాపిల్ తన ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరలను భారీగా పెంచిన సంగతి తెలిసిందే. దీంతో ఏఐ మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న ఖర్చు, పెరుగుతున్న సెమీ కండక్టర్ల ధరలు బిగ్ టెక్ కంపెనీలనూ వదలడం లేదన్న సంకేతాలను పంపింది. దీంతో యాపిల్ షేరు విలువ నిన్న ఒక్కరోజే 6.1 శాతం మేర క్షీణించింది. 25 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ షేర్లు కూడా పతనమయ్యాయి. ఈ ఉదంతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల కోసం భారీగా అప్పులు చేసి పెడుతున్న పెట్టుబడులు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగుతాయా లేదా అనే అనుమానాలను ఇన్వెస్టర్లలో నెలకొల్పింది. ఏఐ పెట్టుబడులపై ఆలోచనలో పడేసింది. ఈ క్రమంలోనే చైనాకు చెందిన సీఎస్ఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండెక్స్ 5 శాతం, సీఎస్ఐ 5జీ కమ్యూనికేషన్ ఇండెక్స్ 6.3 శాతం, హాంగ్ సెంగ్ టెక్ ఇండెక్స్ 3.3 శాతం చొప్పున క్షీణించాయి.

# టీ20ల్లో సంచలనం.. స్వదేశంలో భారత్‌ను చిత్తు చేసిన ఐర్లాండ్!



సంచలనాలకు నెలవైన టీ20ల్లో పెద్ద జట్టైన భారత్‌కు ఐర్లాండ్ ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల సిరీస్ తొలి పోరులో టీమిండియాను 34 పరుగుల తేడాతో ఓడించింది. 183 పరుగుల ఛేదనలో హిట్టర్లతో నిండిన భారత జట్టు అలవోకగా గెలుస్తుందనుకుంటే.. ఐరిష్ బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు. మాథ్యూ హెులార్డ్(3-28)తో మిడిలార్డర్‌ను దెబ్బతీయగా.. అభిషేక్ శర్మ(50),శివం దూబే(25) కాసేప పోరాడాడు. ఫలితంగా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది ఆతిథ్య జట్టు.

టీ20 వరల్డ్‌కప్‌ను మూడుసార్లు ముద్దాడిన భారత్‌ను చిన్న జట్టైన ఐర్లాండ్ ఓడించింది. స్వదేశంలో బ్యాటుతో, బంతితో, ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన ఐరిష్ టీమ్ సంచలన విజయంతో టీమిండియాకు షాకిచ్చింది. తొలుత ఆడిన ఐర్లాండ్. 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రికార్డు వీరులైన భారత బ్యాటర్ల ముందు ఈ లక్ష్యం ఏం నిలుస్తుంది అనుకున్న వారి అంచనాలు తప్పని ఐర్లాండ్ నిరూపించింది. పొట్టి వరల్డ్‌కప్‌లో ఇరగదీసిన ఓపెనర్ సంజూ శాంసన్(5) బంతిని వికెట్ల మీదకు ఆడుకోగా.. ఇషాన్ కిషన్(1).. శ్రేయస్ అయ్యర్(3) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఐరిష్ బౌలర్లు ఒత్తిడి పెంచే ప్రయత్నాన్ని అభిషేక్ శర్మ(50) అర్ధ శతకంతో నీరుగార్చాడు. కానీ బౌన్సర్లు, షార్ట్ పిచ్ బంతులతో టీమిండియా హిట్లర్లకు కళ్లెం వేశారు. సుందర్(9), తిలక్ వర్మ(19) సైతం నిలబడలేదు. చూస్తుండగానే ఐదు వికెట్లు పడడంతో శివం దూబే(25), అక్షర్ పటేల్(15) గెలిపించే ప్రయత్నం చేశారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ చేసిన దూబేను మూంగ్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. డెలానీ ఓవర్లో సిక్సర్ కొట్టే క్రమంలో టెక్టర్ చేతికి చిక్కాడు అక్షర్. దాంతో.. టీమిండియా ఓటమి ఖాయమైంది. సిక్సర్‌తో ఆశలు రేపిన హర్షిత్ రానా(8) బౌండరీ వద్ద దొరికగా.. 19వ ఓవర్ చివరి బంతికి అర్ష్‌దీప్ సైతం ఔటయ్యాడు. భారత్ 148కే ఆలౌటవ్వగా.. 34 రన్స్ తేడాతో ఐర్లాండ్ గెలుపొందింది. భారత బౌలర్లు పంజా విసిరినా ఐర్లాండ్ భారీ స్కోర్ కొట్టింది. టాస్ ఓడిన జట్టుకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ రాస్ అడైర్(12)ను ఔట్ చేసి హర్షిత్ రానా(3-24) తొలి వికెట్ అందివ్వగా.. హ్యారీ టెక్టర్(0)ను అర్ష్‌దీప్ సింగ్(2-28) పెవిలియన్ పంపాడు. తర్వాతి ఓవర్లో టిమ్ టెక్టర్(17)ను రానా డగౌట్ చేర్చగా 30 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఆచితూచి ఆడాలనుకున్న బెంజమిన్ కాలిట్జ్(15)ను దూబే బోల్తా కొట్టించాడు. కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ లొర్కాన్ టక్నర్(50), గరెత్ డెలానీ(49)లు ఆదుకున్నారు. టపటపా నాలుగు వికెట్లు పడిన దశలో టక్నర్, డెలానీ నిలబడ్డారు. మరో వికెట్ పడకుండా.. రన్‌రేటు తగ్గకుండా స్కోర్ బోర్డును నడిపించారిద్దరూ. దూబే ఓవర్లో ఫోర్, డబుల్స్‌లో ఐరిష్ సారథి అర్ధ శతకం సాధించాడు. కానీ హర్షిత్ ఓవర్లో టక్నర్.. తిలక్ వర్మ చేతికి చిక్కడంతో 115 వద్ద ఐదో వికెట్ పడింది. డెత్ ఓవర్లలో గేర్ మార్చిన గెలానీ బౌండరీలు రాబట్టగా.. ఐర్లాండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేయగలిగింది.

## స్పోర్ట్స్

### లీగ్ దశలో ఒక్క గోల్ ఇవ్వలే.. ఆరో జట్టుగా మెక్సికో రికార్డు..!



ఆద్యంతం వేడుకలా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో మెక్సికో చరిత్ర సృష్టించింది. లీగ్ దశలో మూడుకు మూడు మ్యాచుల్లో విజయాలతో నాకౌట్‌కు వెళ్లిన ఆతిథ్య జట్టు.. ప్రత్యర్థిని ఒక్కగోల్ కూడా కొట్టనివ్వలే. తద్వారా.. లీగ్ దశలో శత్రు జట్టుకు ఒక్క గోల్ సమర్పించుకోని జట్టుగా రికార్డు పుస్తకాల్లో నిలిచింది. మొత్తంగా సాకర్ వరల్డ్‌కప్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆరో జట్టుగా మెక్సికో గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో రికార్డులు బద్ధలవుతున్నాయి. లీగ్ దశ 33వ మ్యాచ్‌లోనే వంద గోల్స్ నమోదవ్వడం ఓ రికార్డైతే.. ఆతిథ్య మెక్సికో ప్రత్యర్థికి ఒక్క గోల్ ఇవ్వకుండానే నాకౌట్ చేరింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో చిత్తు చేసి.. హ్యాట్రిక్ విజయాలతో ఔరా అనిపించిన మెక్సికో వరల్డ్‌కప్ చరిత్రలో అరుదైన ఫీట్ సొంతం చేసుకుంది. ఇదివరకూ నెదర్లాండ్స్(1974), బ్రెజిల్(1986), ఇటలీ(1990), అర్జెంటీనా(1998), ఉరుగ్వే (2018).. ఈ ఐదు జట్లు మాత్రమే లీగ్ దశలో ప్రత్యర్థిని ఒక్క గోల్ కొట్టనివ్వలేదు.

గ్రూప్ ఏలోని మెక్సికో తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 0-2తో ఓడించింది. రెండో గేమ్‌లో దక్షిణ కొరియాను వణికిస్తూ 1-0 విజయం సాధించింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో ఓడించిన మెక్సికో నాకౌట్ బెర్తు పట్టేసింది. మూడు విజయాలు.. ఆరు పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది మెక్సికో. 32వ రౌండ్ తొలి మ్యాచ్‌లో మంగళవారం ఎస్తాడియో అజ్టెకాను ఎడ్సన్ అవ్వరెజ్ సారథ్యంలోని మెక్సికో ఢీకొట్టనుంది.



# 6 క్యారవాన్లు, 50 మంది అసిస్టెంట్లు.. విజయ్ దేవరకొండ డిమాండ్ వార్తలపై స్పందించిన నిర్మాత

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, కాన్సెప్ట్ విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రాల్లో ఒకటిగా 'రణబాలి' రూపొందుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## ఉత్కంఠను కలిగించేలా 'తత్వం' ట్రైలర్



కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎడిటర్ విప్లవ్ నైషదం మాట్లాడుతూ " ఈ సినిమా జర్నీ ఎంతో స్పెషల్.. ఈ సినిమా కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. అర్జున్ సాఫ్టవేర్‌రంగం నుంచి వచ్చి ఎంతో ఇష్టంతో ఈ సినిమాకు దర్శకత్వం చేశాడు. ఎంతో అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ చిత్రాన్ని డీల్ చేశాడు,. ఆద్యంత ఎంతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు నాకు సంతోషంగా ఉంది' అన్నారు. సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ " ఈ రోజుల్లో చిన్న సినిమాల ద్వారా మంచి కంటెంట్‌ను ఇస్తున్నారు. ఆడియన్స్ కూడా ఆదరిస్తున్నారు. ఇది కూడా ఆ కోవలోకి వచ్చే చిత్రమే. ఈ సినిమా అందరికి తప్పకుండా నచ్చుతుంది. మంచి ఎమోషనల్ కనెక్టవిటి ఉన్న థ్రిల్లర్. సంగీతానికి స్కోప్ ఉన్న చిత్రమిది. అర్జున్ ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు' అన్నారు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ " ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ఈసినిమా మంచి అవుట్ పుట్ రావడానికి అందరూ సహకరించారు. అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ " ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. ఈ సినిమా కోసం అందరూ దిబెస్ట్ ఇచ్చారు. కథ తప్పకుండా అందర్ని ఎంగేజింగ్‌గా ఉంటుంది. వంశీ గారి అన్వేషణ తరహాలోనే అందర్ని కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియన్స్‌కు షాకింగ్‌గా ఉంటుంది।' అన్నారు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ ''నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది. ఇక మీద నా సినిమాలకు గ్యాప్ రాదు.





# 4 నెలల్లో షూటింగ్ కంప్లీట్.. 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్‌డేట్!

మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

# తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనలతో 'సర్కారు బాయి'






శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి అనే ఊరిలో "సర్కారు బాయి" చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ లెంగ్తీ షెడ్యూల్ లో సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సీన్స్ షూటింగ్ చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,